## ఉగ్రవాద కదలికలపై ప్రత్యేక దృష్టి...

అమరావతి,రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తీర ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు- చేయాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఆయన లేఖ రాశారు. రోహింగ్యాలు, ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్‌పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. దేశ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోహింగ్యాలు, స్లీపర్ సెల్స్‌పై దృష్టి పెట్టండని ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పోలీస్ ఉన్నతాధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమన్నారు. దేశ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని.. రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీకి ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి' అని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ లేఖలో పేర్కొన్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :76 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: బుధవారం 21-05-2025 పేజీలు:4 వెల: 2.00


## రాజ్‌భవన్‌లో చోరీ.. హార్డ్ డిస్కులు మాయం



హైదరాబాద్: రాష్ట్రంలో మరో సంచలనం చోటుచేసుకున్నది. ఇప్పటివరకు సాధారణ పౌరులు, అధికారులు, రాష్ట్ర మంత్రుల ఇండ్లలోనే చోరీలు జరిగాయి. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర ప్రథమ పౌరుడి నివాసం, అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ, సీసీ కెమెరాలతో నిఘా ఉండే రాజ్‌భవన్‌లో దొంగతనం జరిగింది. గవర్నర్ అధికార నివాసంలోకి దర్జాగా వెళ్లిన ఓ వ్యక్తి.. మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ రూమ్‌లోకి చొరబడి హార్డ్ డిస్కులు ఎత్తుకెళ్లాడు. ఇంతకూ ఇది ఇంటి దొంగల పనా లేదా మరెవరి పాత్రైనా ఉన్నదా?నిత్యం హై సెక్యూరిటీతో, సీసీ కెమెరాల నిఘాలో ఉండే రాజ్‌భవన్‌లో ఓ అంగతకుడు చోరీకి పాల్పడ్డాడు. రాజ్ భవన్ సుధర్మ భవన్‌లో విలువైన హార్డ్ డిస్క్‌లు ఎత్తుకెళ్లాడు. మే 14న రాత్రి హెల్మెట్ ధరించి వచ్చిన వ్యక్తి సుధర్మ భవన్‌లో మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్లినట్లు సీసీటీవీల్లో గుర్తించారు. మొత్తం నాలుగు హార్డ్ డిస్క్‌లు మాయమైనట్లు సిబ్బంది నిర్ధారించారు. ఈ మేరకు రాజ్‌భవన్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీస్ సిబ్బంది సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. హార్డ్‌డిస్క్‌లలో రాజ్‌భవన్ వ్యవహారాలతోపాటు.. కీలకమైన కొన్ని రిపోర్ట్‌లు, ఫైళ్లు ఉన్నట్టు తెలుస్తున్నది. అసలు ఆరోజు హెల్మెట్‌తో కంప్యూటర్ రూమ్‌లోకి ఎవరు వెళ్లారనే దానిపై పోలీసులు దృష్టిసారించారు.


## ఆపరేషన్ సింధూర్ ముగియలేదు.. ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌ను అప్పగించాల్సిందే!



న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకుంది భారత్. ఈ నేపథ్యంలో ఉగ్రవాదుల దేశాన్ని ఏకాకిని చేసేందుకు ఇండియా అనేక వ్యూహాలు రచిస్తుంది.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టడానికి భారత్ ప్లాన్ చేసింది. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌లోని భారత రాయబారి జేపీ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్‌కు "విరామం" ఇచ్చాం అంతే "ముగియలేదని" తేల్చి చెప్పారు. 26/11 ముంబై ఉగ్ర దాడి ప్రధాన సూత్రధారులలో ఒకరైన తహవూర్ హుస్సేన్ రాణాను అమెరికా భారత్ కు అప్పగించినట్లుగానే.. ఇస్లామాబాద్ లోని కీలక ఉగ్రవాదులు హాఫీజ్ సయీద్, సాజిద్ మీర్, జకీర్ రెహ్మాన్ లఖ్వీలను అప్పగించాలని భారత రాయబారి జేపీ సింగ్ డిమాండ్ చేశారు.అయితే, పాకిస్తాన్ లోని ఉగ్రవాద గ్రూపులను మాత్రమే భారత్ టార్గెట్ చేసింది.. కానీ, పాక్ మాత్రం మా దేశ సైనిక స్థావరాలపై దాడి చేసేందుకు ట్రై చేసిందని ఇజ్రాయెల్ లోని భారత రాయబారి జేపీ సింగ్ వెల్లడించారు. కాగా, ఉగ్రవాదంపై మా పోరాటం కొనసాగుతుంది.. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా.. వారిని హతమార్చే వరకు ఈ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. మే 10వ తేదీన తెల్లవారుజామున నూర్ ఖాన్ స్థావరంపై భారతదేశం చేసిన దాడిని గేమ్ ఛేంజర్‌గా అతడు అభివర్ణించారు. దీంతో పాకిస్తాన్‌లో భయాందోళనలు స్టార్ట్ కావడంతో.. DGMO కాల్పుల విరమణ కోసం భారత ప్రతినిధులను సంప్రదించిందని రాయబారి జేపీ సింగ్ చెప్పుకొచ్చారు.

## భయపెడుతున్న కరోనా కొత్త వేరియంట్..



న్యూఢిల్లీ,కరోనా భయపెడుతోంది.. దేశంలో యాక్టివ్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 257కు చేరింది. వారం రోజుల్లో 164 కేసులు నమోదైనట్లు లెక్కలు చెప్తున్నాయి. ఇక విదేశాల విషయానికి వస్తే.. సింగపూర్, హాంకాంగ్‌లో కొవిడ్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడులో కొవిడ్ కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం కొవిడ్ కేసులపై దృష్టి సారించింది. కొవిడ్ నియంత్రణలోనే ఉంది, ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. హాంకాంగ్, సింగపూర్‌లో కోవిడ్ 19 కేసుల పెరుగుదలతో దేశంలో 257 కేసులు నమోదయ్యాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.హాంకాంగ్, సింగపూర్లో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్ర ఆరోగ్య శాఖ..ప్రస్తుతం భారత్ లో 257 యాక్టివ్ కేసులున్నాయని.. ఆందోళన అవసరం లేదని చెప్పింది. కోవిడ్ పరిణామాల దృష్ట్యా డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన ఆరోగ్య విభాగాల ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ విభాగం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల నిపుణులు కోవిడ్ పరిస్థితులను సమీక్షించారు.భారతదేశంలో ప్రస్తుత COVID-19 పరిస్థితి నియంత్రణలోనే ఉందని నిపుణులు తేల్చారు. దేశ జనాభాను పరిగణనలోకి తీసుకుంటే కోవిడ్ కేసుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఉన్న కేసులన్నీ దాదాపుగా తేలికపాటివి, ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (IDSP), ICMR ద్వారా దేశంలో COVID-19 సహా శ్వాసకోశ వైరల్ వ్యాధుల పర్యవేక్షణకు బలమైన వ్యవస్థ కూడా ఉందని నిపుణులు చెప్పారు.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించడంలో అప్రమత్తంగా ఉందని, ప్రజారోగ్యాన్ని కాపాడటానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ.. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడులో కొవిడ్ కొత్త కేసులు పెరుగుతున్నాయని చెప్పింది.

### కోవిడ్-19 JN 1 వేరియంట్ లక్షణాలు ఇవే..

కోవిడ్-19 JN 1 వేరియంట్ కారణంగా రోగులకు జ్వరం, అలసట, తలనొప్పి గొంతు నొప్పి ఉన్నట్లు గుర్తించిన ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

## పవన్ ఎలా ఉన్నా.. బాబుపై మాత్రం మామూలుగా లేదుగా!




అమరావతి,ప్రభుత్వంలో ఉన్న నాయకులపై ఒత్తిడి సహజం. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు .. తమ కోరికలు తీర్చాలని నాయకులు.. కోరుకోవడం కామన్ అయిపోయింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇదేసమయంలో తమకు ఎప్పుడు న్యాయం చేస్తారా? అని నాయకులు ఎదురు చూస్తున్నారు. ఈ రెండు అంశాలు ఏ ప్రభుత్వం ఉన్నా.. కామనే.అయితే.. సాధ్యమైనంత వరకు ఈ రెండు విషయాలను పరిష్కరించేందుకు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ప్రయత్నిస్తూనే ఉంటారు. అయితే.. ఈ విషయంలో చంద్రబాబుపై ఉన్న ఒత్తిడి.. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌పై లేకపోవడం గమనార్హం. సూపర్ సిక్స్ విషయాన్ని పక్కన పెడితే.. పదవుల విషయంలో చంద్రబాబు చుట్టూ.. ఇప్పటికీ.. తమ్ముళు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. నిజానికి 100కు పైగా పదవులు పంచినా.. టీడీపీలో సీనియర్లు ఇంకా వెయిటింగ్ లిస్టులోనే ఉన్నారు.దీంతో వీరంతా తమకు బాబు ఎప్పుడు న్యాయం చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు. దీంతో మెజారిటీ నియోజకవర్గాల్లో ఇదే చర్చ సాగుతోంది. ఏ ఇద్దరు సీనియర్లు కలుసుకున్నా.. పదవుల వ్యవహారమే చర్చకు వస్తోంది. కానీ.. పవన్ విషయానికి వస్తే.. ఆయన ఇవ్వాలని అనుకున్న పదవులను అందరికీ దాదాపు ఇచ్చేశారు. ఇక, వచ్చేవాటిలో పదవులు ఎలానూ వస్తాయి కాబట్టి.. కీలక నాయకులు దాదాపు కొలిక్కి వచ్చేశారు కాబట్టి.. పవన్ ఖేఫీకర్‌గా ఉన్నారు.కానీ, చంద్రబాబు పరిస్తితి అలా లేదు. ఇక, మరో కీలక విషయంలోనూ.. బాబు ఇబ్బందులు పడుతున్నా రు. వైసీపీ హయాంలో చంద్రబాబును జైల్లో పెట్టి, నారా లోకేష్ యువగళం పాదయాత్రకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టిన జగన్ పరిస్థితిని వారు ప్రశ్నిస్తున్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ జైలుకు వెళ్లడంతో కొందరు శాంతించారు.కొడాలి నానిపై కసి ఉన్నా.. ఆయన అనారోగ్యం నేపథ్యంలో ఈ విషయం చర్చకు రావడం లేదు. అయితే.. జగన్ విషయాన్ని మాత్రం తమ్ముళ్లు వదిలి పెట్టడం లేదు. దీంతో ఆయనను ఎప్పుడు జైలుకు పంపిస్తారంటూ.. టీవీ డిబేట్లలో చర్చిస్తున్నారు. ఈ వ్యవహారం కూడా బాబుపై ఒత్తిడి పెంచుతుండడం గమనార్హం.

## కేసీఆర్ ఊతపదంతోనే రేవంత్ చెడుగుడు !



హైదరాబాద్,రాజకీయాల్లో ఒక్కో నేతకు ఒక్కో ఊతపదం ఉంటుంది. అలాగే తెలుగునాట తిట్ల రాజకీయం భలే పసందుగా ఉంటుంది. నాయకులు ప్రత్యర్థులను విమర్శించే క్రమంలో పాత సామెతలను వల్లె వేస్తారు పడికట్టు పదాలను జత కలుపుతారు. ఇళ్ళలో అల్లరిగా తిట్టే పదాలను కూడా మిళాయించి మరీ ప్రత్యర్థుల మీద ప్రయోగిస్తారు.ఈ విషయాలలో కేసీఆర్ సిద్ధ హస్తుడుగా పేరు గడించారు. ఆయన ప్రత్యర్థులు పేర్లు పెట్టకుండా సన్నాసులు అనే వారు. ఆ సన్నాసులున్నారే అని తిట్లు లంకించుకునేవారు. సన్నాసులు చటలు దద్దమ్మలు ఇలా అనేక తిట్లు అలవోకగా కేసీఆర్ నోట జాలువారేవి. వాటిని విని ఆనందించే వారు ఉన్నారు. అయ్యో ఇదేమి భాష అని విస్మయపడే వారూ ఉన్నారు.ఏది ఏమైనా ఎవరినైనా అనడం అలా తిట్టడం ఒక్క కేసీఆర్ కే చెల్లు. అయితే ఆయన ఊతపదమైన సన్నాసులు అన్న దానిని ఇపుడు తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి పుణికి పుచ్చుకున్నారు. ఆయన కూడా సన్నాసులు అని వాడేస్తున్నారు. తాజాగా నల్లమలలో జరిగిన ఒక సభలో రేవంత్ మాట్లాడుతూ ఒక అయిదురుగు సన్నాసులు తెలంగాణాలో ఉన్నారని ఆశ్చర్యకరమైన విమర్శ చేశారు.ఆ అయిదుగురు ఎవరో ఆయన చెప్పలేదు కానీ వారి ఊసే తాను తలవను పట్టించుకోనూ అన్నారు ఇక వారు సోషల్ మీడియా పులులు అని హాట్ కామెంట్స్ చేశారు. వారు సోషల్ మీడియాలో చేసే చెడు ప్రచారం గురించి తాను ఎక్కడా ఫికర్ అయ్యేదే లేదని అన్నారు. అసలు ఆ తప్పుడు ప్రచారం గురించి తాను పట్టించుకోను కదా అన్నారు.తాను చేసే మంచి పనిని లబ్ది పొందిన వారు గుర్తు పెట్టుకుంటే చాలు అని రేవంత్ అన్నారు. అంతే తప్ప తమ మీద విషం చిమ్మాలని చూసే వారిని తాను ఏ మాత్రం ఖాతరు చేసేది లేదని రేవంత్ రెడ్డి ఖరాఖండీగా చెప్పేసారు. ఇలా రాష్ట్రంలో కొందరు సన్నాసులు ఉన్నారని ఆయన అన్నారు.మరి ఆ సన్నాసులు ఎవరా అన్నదే అందరికీ అర్థం అయ్యీ కాని విషయంగా ఉంది. రేవంత్ రెడ్డి విమర్శించారూ అంటే రాజకీయ ప్రత్యర్థుల గురించే అయి ఉంటుంది. మరి ఆ ప్రత్యర్థులలో అంతలా సన్నాసులుగా ఉన్న వారు ఎవరు అన్నది ఒక ప్రశ్న అయితే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండి తప్పుడు ప్రచారం చేసే వారు ఎవరా అన్నది మరో ప్రశ్న.అయితే రేవంత్ రెడ్డి చెప్పకపోయినప్పటికీ రాజకీయాల మీద అవగాహన ఉన్న వారికి ఆ సన్నాసులు అన్నది ఎవరి గురించో తెలుసు. కానీ ఆయన పేరు చెప్పలేదు కాబట్టి ఎవరూ ఆ పేర్లను గురించి కాకుండా భలే సెటైర్లు వేశారే అని అనుకుంటున్నారు. ఇంతకీ కేసీఆర్ తరహాలో సన్నాసుల జాబితాను రేవంత్ రెడ్డి తయారు చేస్తున్నారులా ఉంది అని కామెంట్స్ చేస్తున వారూ ఉన్నారు.ఏది ఏమైనా అధికారంలో ఉన్న వారిని విమర్శించడం విపక్షం విధి అయితే వారి మీద కౌంటర్లు వేయడం అధికార పక్షం పరమావధి. సో అలా సన్నాసులు అయిన వారు ఇపుడు అయిదారుగురు రేవంత్ రెడ్డి దృష్టిలో ఉన్నారు అన్న మాట. సో వారి పేర్లతో సహా పిలిచి వారే సన్నాసులు అని రేవంత్ రెడ్డి ఫ్యూచర్ అయినా చెబుతారమో చూడాల్సి ఉంది.

## విజయనగరం ఉగ్రమూలాల కేసు.. వెలుగులోకి కొత్త కోణాలు



హైదరాబాద్: విజయనగరం ఉగ్రకుట్ర కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో పట్టుబడ్డ ఏపీ విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్ బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్ భారీ విధ్వంసానికి ప్లాన్ చేసినట్టుగా తెలుస్తోంది. కర్ణాటక, మహా రాష్ట్ర యువకులు సైతం వీరి గ్యాంగ్‌లో ఉన్నట్టు తెలిసింది. వీరంతా ఇటీవలే హైదరాబాద్‌లో సమావేశమై బాంబు పేలుళ్ల కుట్రలకు సంబంధించి పలు అంశాలు పంచుకున్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఏపీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా సిరాజ్, సమీర్‌లను ఆదివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విజయనగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్న ఈ కేసులో అనేక కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉగ్రలింకుల నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు సైతం రంగంలోకి దిగారు. సోమవారం విజయనగరం వెళ్లి స్థానిక పోలీసులు, ఇరు రాష్ట్రాల ఇంటెలిజెన్స్ అధికారుల నుంచి కీలక సమాచారం సేకరించారు. సౌదీ హ్యాండ్లర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు భారీ పేలుళ్ల కుట్రకు తెరతీసినట్టు కీలక ఆధారాలు ఉండటంతో ఎన్ఐఏ ప్రత్యేకంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిసింది.

### ప్రత్యేకంగా ఇన్‌స్టాగ్రామ్ గ్రూపు

ఈ కుట్రలో సిరాజ్, సమీర్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వారు కలిపి మొత్తం ఆరుగురు ఉన్నట్టు గుర్తించారు. వీరంతా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకోగా.. సౌదీ హ్యాండ్లర్ అన్ని కీలక విషయాలను వీరి గ్రూప్ కు పంపుతున్నాడు. ఇప్పటికే వీరంతా హైదరాబాద్‌లో సమీర్ సహాయంతో ఒక రహస్య ప్రాంతంలో 3 రోజులపాటు గడిపినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందు లో ప్రధానంగా బాంబుల తయారీ, అందుకు అవసరమైన వస్తువుల కొనుగోలు, డమ్మీ బ్లాస్టులు చేయడం, ఆ తర్వాత ఎవరు.. ఎప్పుడు.. ఎక్కడ.. ఎవరిని కలవాలి, తదుపరి కార్యాచరణ వంటి అనేక విషయాలు చర్చించుకున్నారు. సమీర్, సిరాజ్‌కు బాంబుల తయారీ పదార్థాల కొనుగోలు, తయారీ బాధ్యతను హ్యాండ్లర్ అప్పగించాడు. యూట్యూబ్‌లో వీరిద్దరూ బాంబుల తయారీ విధానం చూసినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో పేలుడు పదార్థాలు కొనుగోలు చేస్తే అనుమానం వస్తుందని, విజయనగరానికి చెందిన సిరాజ్‌కు ఆ బాధ్యత అప్పగించారు. టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేసేందుకు ప్రయోగాలు చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇందుకు అవసరమైన టిఫిన్ బాక్సులు, వైర్లు, రిమోట్ సెల్స్ అమెజాన్‌లో ఆర్డర్ చేసినట్లు తేలింది. ఏపీ రంపచోడవరం అటవీ ప్రాంతంలో ఇప్పటికే పలుమార్లు రిహార్సల్స్ నిర్వహించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. హైదరాబాద్‌లో డమ్మీ బ్లాస్టింగ్స్, ఆ తరువాత వరుస పేలుళ్లకు కుట్ర చేసినట్టు గుర్తించారు.

### సమీర్ గురించి ఆరా..

సికింద్రాబాద్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తున్న సమీ ర్.. బోయిగూడ రైల్ కళారంగ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడే ఉంటూ ఇన్‌స్టాగ్రామ్ గ్రూప్ ద్వారా ఇతర నిందితులకు, సౌదీలోని హ్యాండ్లర్‌కు టచ్‌లో ఉంటున్నాడు. హైదరాబాద్ కేంద్రంగా మిగిలిన ఆరుగురు సభ్యులకు షెల్టర్ ఇవ్వడం.. బాంబుల తయారీలో సిరాజ్‌కు సహకారం అందించడంలో కీలకంగా ఉంటున్నాడు. సమీర్ ఇంకా ఎవరెవరితో సన్నిహితంగా ఉండేవాడు.. సమీర్‌తో కాంటాక్ట్‌లో ఉన్న వారు ఎవరు అన్న విషయాలపై తెలంగాణ ఇంటెలిజెన్స్ ఆరా తీస్తోంది.

## పాకిస్తాన్‌పై భారత్ దాడి చేస్తే.. దాక్కోవడానికి కలుగు వెతుక్కోవాలి!




న్యూఢిల్లీ,పాకిస్తాన్‌లోని అన్ని ప్రాంతాలపై దాడి చేసే సామర్థ్యం భారతదేశానికి ఉందని ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ సుమేర్ ఇవాన్ డి కున్హా పేర్కొన్నారు.పాక్‌లోని ప్రతి ప్రదేశం మీద భారత్ రేంజ్‌లోనే ఉన్నట్లు తెలిపారు. ఒకవేళ పాకిస్తాన్ సైన్యం తమ ప్రధాన కార్యాలయాన్ని రావిల్పిండి నుంచి మారుమూల ప్రాంతానికి తరలించినా.. అక్కడ కూడా వారు కలుగు వెతుక్కొని మరి అందులో దాక్కోవాల్సిందేంటూ ఎద్దేవా చేశారు.ఇక, పాకిస్తాన్ మొత్తాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం దగ్గర తగినన్నీ ఆయుధాలు ఉన్నాయని ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ సుమేర్ తెలిపారు. ఇటీవల పాక్ చేసిన దాడిని ఇండియన్ ఆర్మీ, నేవీ, వైమానిక దళం సమన్వయంతో సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. పాక్ లోని 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. పాకిస్తాన్ భారత్ లోని పౌరుల ఇళ్లపై దాడులకు ప్లాన్ చేసినప్పటికీ ఇండియన్ ఆర్మీ వాటిని తిప్పికొట్టిందన్నారు. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సదరు ఆర్మీ అధికారి వెల్లడించారు.

## పాకిస్తాన్ పాలస్తీనా కాదు, భారత్ ఇజ్రాయెల్ కాదు...




ఇస్లామాబాద్:పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్ లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. భారత క్షిపణులు పాకిస్తాన్ సైనిక స్థావరాలకు భారీ నష్టం కలిగించాయి.కానీ, పాకిస్తాన్ ప్రగల్భాలు పలకడం ఆపడం లేదు.. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి మరోసారి గొప్పలు చెప్పుకున్నారు. భారతదేశం ఇజ్రాయెల్ కాదు.. పాకిస్తాన్ పాలస్తీనా కాదని అన్నారు. అలాగే, కాశ్మీర్ అంశంపై కూడా అతడు భారతదేశంపై నిరాధారమైన ఆరోపణలు చేశారు.ఇక, కాశ్మీర్ అనేది అంతర్జాతీయంగా వివాదాస్పద సమస్యగా పాక్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ అభివర్ణించారు. అయితే, జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉందని.. అది ఎల్లప్పుడూ ఉంటుందని ఇండియా పదే పదే చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. భారతదేశం అమెరికా కాదు.. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ కాదని ఆయన అన్నారు. భారతదేశం దాడి చేస్తే పాకిస్తాన్ గట్టిగా స్పందిస్తుంది.. ఎందుకంటే, మాది ఉగ్రవాద బాధిత దేశమని పాక్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ అభివర్ణించారు.

సంపాదకీయం

బుధవారం 21-05-2025

# ఎన్నికలకు ముందే గ్రామాలు బలపడాలి !

స్థానిక ఎన్నికలు ఇదిగో అదిగో అంటూ కాలం గడిపేస్తున్నారు. ఇప్పటికైతే ఎప్పుడు ఎన్నికలు జరుపు తారన్న గ్యారెంటీ లేదు. తమకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా లేదా అన్న ధోరణిలో తెలుగు పక్షాలు లెక్కలు వేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితుల కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో మంచి మెప్పు పొందేలా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే ఎవరు అధికారంలోకి వచ్చినా స్థానిక సంస్థలను బలోపేతం చేసి, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించడం లేదు. గ్రామస్థాయిలో కూడా పెత్తనం తమ చేతుల్లో ఉండేలా చూస్తున్నారు. వారు విధించే పన్నులను, పనులను వీరే చేస్తున్నారు. దీంతో గ్రామాలు ఆర్థికంగా బలపడడం లేదు. పెత్తనం తమ గుప్పిట్లో పెట్టుకుని సర్పంచ్‌లను డమ్మీలుగా గామర్చారు. గత జగన్ ప్రభుత్వం ఎపిలో సర్పంచ్‌లకు సమాంతరంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలను పెట్టారు. ఇప్పుడు తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామంటున్నారు. రాజీవ్ గాంధీ స్థానిక ప్రభుత్వాల బలోపేతం కోసం తీసుకుని వచ్చిన రాజ్యాంగ సవరణలను తుంగలో తొక్కుతున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న గ్రామాలను అభివృద్ధి పరచి, సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాలకురచన జరగడం లేదు. గ్రామస్థాయి నుంచి ప్రణాళిక సాగివుంటే గ్రామాలు బాగుపడి రాష్ట్రం, దేశం బగుపడేది. కానీ అలాంటి ఆలోచన కార్యరూపం దాల్చడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎంల పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామస్థాయి లో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగడం లేదు. కేంద్రం నేరుగా నిధులు ఇవ్వడం ద్వారా గ్రామాలను బలోపేతం చేయాలని కేంద్రం ఆలోచన చేసినా అందుకు పాలకులు సిద్దంగా లేరు. వివిధ పథకాలతో చేస్తున్నపెత్తనాన్ని తగ్గించుకోవడం లేదు. గ్రామాలు చేయాల్సిన నిర్ణయాలను సచివాల స్థాయిలో తీసుకుంటున్నారు. ఎన్నికైన సర్పంచ్‌లను డమ్మీలుగా చేస్తూ..వారికి నిధులు కేటాయించకుండా..వారిని పనిచేయనీయ కుండా పెత్తనం చెలాయిస్తున్న తీరు వల్ల గ్రామాల సమగ్ర అభివృద్దికి నోచుకోలేదు. గ్రామాలకు ఏమి అవసరమన్నది గుర్తించి నిధులు విడుదలచేసి, అమలు చేయించేలా కార్యక్రమాలు సాగివుంటే ఆర్థికవ్యవస్థ ఎప్పుడో బలోపేతం అయ్యేది. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్దం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్దం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రాలుగా తీర్చి దిద్దాలి. గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ఉద్యోగులను పనిచేసేలా చేయాలి. అలాగే పనులకు సంబంధించి గ్రామాల్లో తీర్మానం చేయించి అమలు చేయించాలి. సిఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా అవసరమైతే ప్రణాళికలను అమలు చేయాలి. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. గ్రామాలను యూనిట్‌గా కార్యక్రమాల రచన సాగాలి. సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించిన ఫలితం సాధిస్తుంది. ప్రధానంగా పారిశుద్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్చత అన్నది వ్యక్తిగతమైన శ్రద్దకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. ఇప్పటికీ ఆరుబయట మల విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. నిత్యం టీవీల్లో పత్రికల్లో ప్రకటనల ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్నా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశు భ్రత అని గ్రహించడం లేదు. వ్యక్తిగత మరుగుదొడ్ల కు 12వేల ఆర్థిక సాయం అందిస్తున్నా గ్రామాల్లో ప్రజలు వెంటనే మరుగుదొడ్లు నిర్మించు కునేందుకు ముందుకు రావడం లేదు. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. గ్రామాలను యూనిట్‌గా చేసి సర్పంచ్‌లకు బాధ్యత అప్పగించి ఉంటే ఇది వందశాతం సక్సెస్ అయ్యి ఉండేది. కానీ గ్రామస్థాయిలో పనులకు సర్పంచ్ లను బాధ్యులను చేయక పోవడం వల్ల కార్యక్రమాలు విజయవంతం కావడం లేదు. గ్రామస్థాయిలో పని ఏదైనా సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీ ద్వారా అమలు చేయాల్సి ఉంది. ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. దీంతో వ్యవస్థ బలోపేతం అవుతుంది. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్య కార్మికులు లేకపోవడంతో పల్లెల్లో పారిశు ద్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రత లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురుగుకాల్వల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారు లేనందున దుర్వాసన వెదజల్లు తుండటంతో పల్లె ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రహదారుల్లోనే మురుగు నీరు ప్రవహిస్తుండటం దోమల బెడద తీవ్రం కావడంతో రోగాల బారిన పడుతున్నారు. అనేక అంటురోగాలు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగ్యూ విజృంభిస్తోంది. సర్పంచ్‌లు ఉన్నా లేకున్నా ఈ పనులను పెద్దగా పట్టించుకోవడంలేదు. ఇలాంటి సమస్యలనే ఇప్పుడు అధ్యయనం చేయాలి. గ్రామాలను బలోపేతం చేయాలి. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. సర్పంచ్‌లను,పంచాయితీల పాలకవర్గాలను విశ్వాసంలోకి తీసుకుని వారిని బాధ్యులను చేసినప్పుడే గ్రామాల రూపురేఖలు మారగలవు.సర్పంచ్‌లకు పూర్తిస్థాయి అధికారాలను దఖలు పరచాలి. నిధులు సకాలంలో విడుదల చేయాలి. అప్పుడే గ్రామాలు బలపడతాయి. ఎన్నికలకు ముందే ఈ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలి.

# రాష్ట్రపతి,గవర్నర్ చక్రవర్తులా?

హైదరాబాద్,అసెంబ్లీ బిల్లుల విషయమై సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాల గురించిన చర్చలు చాలా జరుగుతున్నా ప్రజాభిప్రాయం ఎట్లా ఉన్నదనే ప్రస్తావన మాత్రం ఎక్కడా రావటం లేదు. ఈ అంశంపై రాజ్యాంగం, చట్టాలు, గత వివాదాలు, తీర్పులలో విషయాలు చాలానే ఉన్నాయి. అవి అన్నీ ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి. అంతవరకు మంచిదే. అదే సమయంలో కొన్ని వివాదాలకు అసాధారణ స్వభావం ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది గమనించడం కూడా అవసరం. తమిళనాడు గవర్నర్ తీరును పురస్కరించుకొని తలెత్తిన సమస్య అటువంటిది. రాష్ట్రపతి, తదితరుల రాజ్యాంగ అధికారాలు ఏవైనా, అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో వీరెవరూ మధ్యయుగాల నాటి చక్రవర్తులు కారు. అందరి అధికారాలకు మూలం ప్రజాభిప్రాయంలో ఉంటుంది.ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రజాస్వామిక వ్యవస్థలు ఏర్పడటం, రాజ్యాంగాలు, చట్టాలు రూపొందటం నిజమే. అటువంటప్పుడు, యథాతథంగా ఆలోచించినట్లయితే ప్రతి అంశంపై ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది ఆలోచించనక్కరలేదు. కొన్ని దేశాలలో వలె ప్రతి ముఖ్యమైన అంశంపై రెఫరెండం అవసరం లేదు. కానీ అదెప్పుడు? ఎన్నికైన అధికారపక్షం గాని, ప్రతిపక్షాలు గాని అటువంటి అభిప్రాయాలకు, అవి ప్రతిఫలించే రాజ్యాంగానికి, చట్టాలకు అనుగుణంగా, అక్షరబద్ధంగా, స్ఫూర్తిబద్ధంగా కూడా వ్యవహరించినప్పుడు, పాలించినప్పుడు. అప్పుడే అది ప్రజాస్వామ్యబద్ధ పాలన అవుతుంది. ప్రజలకు ఆమోదకరం అవుతుంది. అందుకు భిన్నంగా వ్యవహరించే అధికారాలు, హక్కులూ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు ఏ విధంగానైతే ఉండవో గవర్నర్లకు, రాష్ట్రపతులకు కూడా ఉండవు. ఎవరూ దైవాంశ సంభూతులు, గతకాలపు చక్రవర్తులు కారు. అందువల్ల, గవర్నర్లను, రాష్ట్రపతినే సుప్రీంకోర్టు ఆదేశిస్తుందా? అనే ప్రశ్న ఎంత మాత్రం అవగాహన లేని, విలువ లేని దురహంకార పూరితమైన వైఖరి మాత్రమే.ఇది చూసినప్పుడు అమెరికాలో జరుగుతున్నది గుర్తుకు వస్తున్నది. భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ అంటారు. నిజమా కాదా అన్నది అట్లుంచి, ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని ప్రధాని మోదీ సగర్వం గా చాటిచెప్తుంటారు. అమెరికాను గొప్ప ప్రజాస్వామ్యమంటారు. ప్రస్తుతం ఈ రెండు ఘనమైన ప్రజాస్వామ్యాల్లో జరుగుతున్నది ఒకే విధంగా ఉండటం విశేషం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్రమ వలసదారులని చెప్పేవారి నుంచి మొదలుకొని, స్వయంగా తమ పౌరులు అయి నవారిపై, పరిపాలనా వ్యవస్థపై తీసుకుంటున్న పలు చర్యలపై కోర్టులు స్టే విధిస్తున్నాయి. కొన్నింటిని కొట్టివేస్తున్నాయి. ఆయా కోర్టు ఉత్తర్వులను ట్రంప్ ప్రభుత్వం పాటించడానికి బదులు బహిరంగంగా ధిక్కరిస్తున్నది. ఆ జడ్జీలను ప్రభుత్వంతో పాటు, ట్రంప్ అధికారులు, అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీ నాయకులు బాహాటంగా పదేపదే విమర్శిస్తున్నారు. వారిని ఇంపీచ్‌మెంట్‌తో పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకరినైతే, నమ్మశక్యం కాని రీతిలో, ఏదో సాకు చూపి అరెస్టు చేసే దాకా వెళ్లారు.ఒక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఇట్లా జరుగుతుండగా, మరొక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఏమి జరుగుతున్నది? గత చరిత్రను పక్కన ఉంచుదాం. తమిళనాడు బిల్లుల సంగతి చూద్దాం. అక్కడి అసెంబ్లీ ఒకటికి రెండుసార్లు రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆమోదించిన బిల్లులను కూడా అక్కడి గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచుతారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత సైతం నిబంధనలకు విరుద్ధంగా అప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపుతారు.బిల్లుల పట్ల ఆ విధమైన వైఖరి వల్ల రాష్ట్రంలో వేర్వేరు శాఖల పరిపాలన దెబ్బతింటుంది. అయినప్పటికీ ఆయన లెక్కచేయరు. ఇదే ఒక అప్రజాస్వామికమైన, రాజ్యాంగ విరుద్ధమైన దారుణ ప్రవర్తన కాగా, అంతకన్న దారుణమైనది మరొక స్థాయిలో జరుగుతుంటుంది. అది ఢిల్లీ స్థాయిలో. అక్కడి నుంచి అన్నీ గమనించే హోంశాఖ, హోంమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఎవరూ అది తగదని వారించరు. పరిస్థితిని సరిదిద్దరు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులు చేసినా పట్టించుకోరు. గవర్నర్ రవి ఇది చాలదన్నట్లు, తన అధికార పరిధులను బాహాటంగా అతిక్రమిస్తూ, అక్కడి అధికారపక్షమైన డీఎంకేకు వ్యతిరేకంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తుంటారు. అటువంటి కార్యకలాపాలలో పాల్గొంటారు.గవర్నర్ రవికి ఒక ప్రతిష్ఠాత్మకమైన నేపథ్యం ఉంది. ఐపీఎస్ అధికారి అయిన ఆయన అందుకు సంబంధించిన పలు హోదాలలో పనిచేసిన తర్వాత, కొన్ని చోట్ల గవర్నర్‌గా కూడా ఉండిన వెనుక, నాగాలాండ్‌కు గవర్నర్‌గా నియమితులయ్యారు. సమస్యాత్మక ఈశాన్య భారత రాష్ట్రాలలో ఐపీఎస్ నుంచి, సైన్యం నుంచి రిటైరైన వారిని గవర్నర్లుగా నియమించటం ఎప్పటినుంచో ఉంది. అంతవరకు సరే. కానీ, వాటన్నింటిలో అతి క్లిష్టమైన, అతి సున్నితమైన నాగాలాండ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. పైగా అప్పుడు నాగా సంస్థలకు, కేంద్రానికి మధ్య చర్చలు జరుగుతున్నాయి. అంతకుముందు అక్కడ పనిచేసిన వారిలో జనరల్



కె.వి.కృష్ణారావు ఉన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన కె.పద్మనాభయ్య నాగాలతో చాలాసార్లు చర్చలు జరిపారు. అప్పుడంతా వారు ఎంతో నేర్పుగా వ్యవహరించారు. కానీ, రవి తీరుతో విసుగెత్తిన నాగాలు ఆయనను తొలగిస్తే తప్ప చర్చలు జరుపబోమని ప్రకటించటంతో కేంద్రం తనను తమిళనాడుకు బదిలీ చేసింది. రాజకీయంగా ఆ రాష్ట్రం మరొక విధంగా సున్నితమైనది. కానీ, ఆయన తీరు మారలేదు. విషయం చిలికిచిలికి ప్రస్తుతం మనం చూస్తున్నట్లు గాలివానగా మారింది.అసలు సమస్య కేంద్రం వద్ద ఉంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నచోట వాటిని రకరకాల ఇబ్బందులకు గురిచేయటం, వీలైతే పడగొట్టడం, అందుకు గవర్నర్లను ఉపయోగించుకోవటం. వాస్తవానికి ఈ అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన ధోరణిని ఆరంభించింది కాంగ్రెస్ పార్టీ. ఆ దుష్ట సంప్రదాయాన్ని బీజేపీ కూడా కొనసాగిస్తున్నది. అప్పుడు కాంగ్రెస్‌కు నీతులు చెప్పి తానిప్పుడు అదే పనిచేస్తున్నది. తమిళనాడు పొరుగున గల కేరళలో ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ఇటు తెలంగాణలో తమిళిసై, అటు పశ్చిమబెంగాల్‌లో ఆనందబోస్‌ల చర్యలు తెలిసినవే.ఇప్పుడు గవర్నర్ రవిని కేంద్రం ఇన్నిన్ని జరుగుతున్నా అదుపు చేయకపోగా, తమకు కొరకరాని కొయ్యగా మారిన డీఎంకేను ఆయన చికాకు పరచటాన్ని చూసి ఆనందిస్తున్నదనాలి. గవర్నర్ పదవి రాజ్యాంగపరమైనది అయినప్పుడు, రాజ్యాంగానికి అధినాయకత్వ స్థానంలో గల రాష్ట్రపతి ఏమి చేస్తున్నట్లు? పైకి కన్పించింది అయితే ఏమీలేదు. తను ఏమైనా చేసినా మనకు కన్పించలేదో లేక రబ్బర్ స్టాంప్ వలె వ్యవహరించారో తెలియదు.ఇంతకూ ఏప్రిల్ 8వ తేదీ నాటి తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందేమిటి? ప్రజలు రాజ్యాంగం ప్రకారం ఎన్నుకున్న చట్టసభలు నిబంధనల మేరకు ఆమోదించిన బిల్లులకు తమ స్థాయిలో ఆమోదం తెలుపటంలో గవర్నర్లు గాని, రాష్ట్రపతి గాని అసమంజసమైన జాప్యం చేయరాదని. నిబంధనలకు లోబడి పరిశీలించటం, పున:పరిశీలన కోసం అసెంబ్లీకి తిప్పి పంపటం వంటివి సరే. కానీ, అవే నిబంధనలకు అనుగుణంగా అసెంబ్లీ తాను చేయవలసిందంతా చేసిన తర్వాత ఏదో ఒకటి తేల్చటంలో విపరీత జాప్యాలు ఎందుకు? అసెంబ్లీ రెండవసారి ఆమోదించినాక ఇక ఆపేందుకు వీల్లేదన్న నిబంధనను పాటించకపోవటమెందుకు? అట్లా జరిగినప్పుడు, అందులో రాజ్యాంగంతో నిమిత్తం లేని రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అనుమానం సహజంగా కలుగుతుంది. న్యాయమూర్తులు చేసింది, ఒకవైపు రాజ్యాంగ నిబంధనలకూ, స్ఫూర్తికి, మరొకవైపు ప్రజాస్వామిక పాలనకు అనుగుణంగా ఉండేట్లు, బిల్లుల ఆమోదానికి మూడు నెలల గడువు విధించటం మాత్రమే. గవర్నర్లకు, రాష్ట్రపతికి కూడా. మూడు నెలలకు మించితే ఆ బిల్లులు ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లేనని కోర్టు స్పష్టం చేసింది. అందులో ఆక్షేపించవలసిందేమీ కన్పించదు. పైగా స్వయంగా కేంద్రమే ఇటువంటి గడువుతో 2016లో మూడు మెమోలు జారీచేసినట్లు కోర్టు గుర్తుచేసింది. నిజానికి రాష్ట్రపతి లేఖను అవకాశంగా తీసుకుని గవర్నర్లు, రాష్ట్రపతితో పాటు స్పీకర్ల అధికారాలు, పరిమితులను కూడా న్యాయమూర్తులు నిర్వచించినట్లయితే ప్రజాస్వామ్యానికి చాలా మేలు జరుగుతుంది.ఇంత జరిగి, ఇంత స్పష్టత వచ్చిన తర్వాతనైనా కేంద్రప్రభుత్వం, అధికార పార్టీ వారు తమ తప్పిదాన్ని గుర్తించి వైఖరిని మార్చుకోలేదు. రాష్ట్రపతి ద్వారా రకరకాల సాంకేతిక ప్రశ్నలతో సుప్రీంకోర్టుకు లేఖ రాయించారు. అందువల్ల కోర్టు మౌలిక ఉత్తర్వుల పరిస్థితి మారేది ఏమీ ఉండదని, న్యాయనిపుణులు గతంలోనూ తలెత్తిన ఇదే విధమైన కేసులను ఉదహరిస్తూ స్పష్టం చేస్తున్నారు. గవర్నర్ రవికి సుప్రీంకోర్టు ఇదే బిల్లుల విషయంలో ఆదేశాలు జారీచేయగా, ఆయన కొన్ని ఆమోదించి, కొన్ని చేయక తన చమత్కారాన్ని ప్రదర్శించారు. దానిపై కోర్టు ఆగ్రహించి ఈ తాజా తీర్పు చెప్పింది. అయినప్పటికీ గ్రహించక రాష్ట్రపతికే ఆదేశాలిస్తారా? అంటూ తమ అధికార దురహంకారాన్ని బీజేపీ నేతలు ప్రదర్శిస్తున్నారు. ఈ మొత్తం సంఘటనల పరంపరపై బయట ఈ దేశ ప్రజల అభిప్రాయాలు ఏ విధంగా ఉన్నాయో గమనించాలనే ఆలోచన ఎవరికైనా కలుగుతున్నదా? రాజ్యాంగ పీఠిక మొదటి వాక్యమే 'ఈ దేశప్రజలమైన

# హైదరాబాద్‌లో ఉగ్రదాడులపై సంచలన ప్రూఫ్స్..




హైదరాబాద్,హైదరాబాద్ పేలుళ్లకు కుట్ర కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సిరాజ్, సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక అంశాలు ప్రస్తావించారు. ఆరుగురు వ్యక్తులు ఇన్‌స్టా గ్రూప్ క్రియేట్ చేసుకున్నట్లు గుర్తించారు. సిరాజ్, సమీర్‌తోపాటు టీమ్‌లో కర్నాటక, మహారాష్ట్ర యువకులు కూడా ఈ గ్రూప్ లో ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో 3 రోజులపాటు కలిసి ఉన్న ఆరుగురు గ్యాంగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాలు అమలు చేయడంపై మీటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేయాలని ఇద్దరికి ఆదేశం ఇవ్వగా.. మిగతా నలుగురికి బాంబ్‌లు పెట్టే టార్గెట్లు గుర్తించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అమేజాన్‌లో టిఫిన్‌బాక్స్‌లు, వైర్లు, రిమోట్ సెల్స్ సిరాజ్..ఆర్డర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిన్న విజయనగరంలో సిరాజ్, హైదరాబాద్‌లో సమీర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. విజయనగరం కోర్టు ఇద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించింది. అరెస్టు సమయంలో సిరాజ్ దగ్గర భారీగా పేలుడు పదార్థాలు గుర్తించారు. అమ్మోనియం నైట్రేట్, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను పోలీసులు సీజ్ చేశారు.సిరాజ్, సమీర్‌ను అరెస్ట్ చేసిన తర్వాత పోలీసలు రిమాండ్ రిపోర్ట్‌లో చాలా కీలక అంశాలు వెల్లడించడం జరిగింది. మొత్తం ఆరుగురు యువకులు కలిసి మూడ రోజుల పాటు హైదరాబాద్‌లో ఉ న్నారు. ఇక్కడ మహారాష్ట్రకు చెందిన యువకులతో పాటు కర్ణాటక యువకులు మొత్తం ఆరుగురు కలిసి ఒకే చోట ఉండి హైదరాబాద్ లో బాంబులు ఎక్కడెక్కడ అమర్చాలి, ఎలా తయారు చేయాలి వాటికి సంబంధించిన స్పాట్లు ఎలా గుర్తించాలి అని ప్లాన్లు వేసారు. అయితే సౌదీ, అరేబియన్ నుంచి వీరికి ఇంటర్నెట్ ద్వారా ఆదేశాలు వచ్చినట్టుగా గుర్తించారు. టిఫిన్‌బాక్స్‌లో బాంబులు తయారు చేసి అవి జనాభా ఎక్కువగా ఉండే స్పాట్లో గుర్తించాలని ఆదేశాలు వచ్చినట్లుగా తెలుపారు. అయితే అమేజాన్‌లో టిఫిన్‌బాక్స్‌లు, వైర్లు, రిమోట్ సెల్స్ ఇవన్ని ఆర్డర్ చేసి కోనుగోలు చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఎవరైతే సిరాజ్, సమీర్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రాం అకౌంట్స్ పైనా కూడా పోలీసులు నిగా పెట్టడంతో కుట్ర భగ్నం అయ్యిందని తెలిపారు.వీరు అన్‌లైన్ ద్వారనే ఉగ్రవాద అనుబంధాలకు ఆకర్షితులై హైదరాబాద్‌లో ఈ కార్యకలాపాలు చేసేందుకు ప్రయత్నించారని పోలీసులు గుర్తించారు. వీరికి సంబంధించిన పూర్తి వివరాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఐసిస్ కి సంబంధించిన హ్యాండర్లను సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాలను ఆక్కడ అమలు చేసే విధంగా సిరాజ్, సమీర్ కూడా పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడించారు. అయితే వీరు 3 రోజులు ఎక్కడ ఉన్నారు.. వీరికి ఎవరు ఆశ్రయం కల్పించారు అనేది వివరాలు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే %చీ×ూ% కూడా రంగంలోకి దిగింది. క్నేసుకు సంబంధించి అన్ని వివరాలు తెలుసుకుంటుందని చెప్పారు. మొత్తం ఆరుగురు యువకులు అని చెప్పారు.. మిగత నలుగురు ఎక్కడికి వెళ్లారు. వారికి సంబంధించిన వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. మొత్తం తెలంగాణ, ఆంధ్ర పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేయడంతో హైదరాబాద్‌లో బాంబులు పేల్చేందుకు కుట్ర భగ్నం చేయగలిగారు.అయితే గ్రూప్స్ ప్రిపరేషన్ కోసం వచ్చిన సిరాజ్, సమీర్ ఇద్దరు ఎలా పరిచయమయ్యారు అనే దాని గురించి ఇన్వేస్టిగేషన్ చేస్తున్నారు పోలీసులు. వీరిని విచారిస్తే మరిన్ని విషయాలు బయటకి వచ్చే అవకశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి 2 తెలుగు రాష్ట్రాల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ సిరాజ్, సమీర్ కు ఎవరెవరు సహాయం చేస్తున్నారు.. వారికి బాంబులకు సంబంధించి ఎక్యూమెంట్ కొనడానికి ఆర్థిక పరమైన సహాయం ఎవరు చేశారని దర్యాప్తు చేస్తున్నారు.

# కాశ్మీర్ పండిట్లలో భరోసా నింపాలి

న్యూఢిల్లీ,బిజెపిని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా అక్కడి నేతలు ఇంతకాలం చేసిన రాజకీయ డ్రామాలకు తెరపడనుంది. పహల్గామ్ ఉగ్రదాడి, పాక్‌పై భారత్ చర్యలు, ఆపరేషన్ సిందూర్ తరవాత ఇక కాశ్మీర్ నేతల వైఖరి మారాలి. ముఖ్యంగా మెహబూబా ముఫ్తీ తనపాక్ అనుకూల వైఖరిని విడనాడాలి. ఫరూక్ అబ్దుల్లా కూడా మారాలి. కేంద్రం తీసుకుంటున్న శాంతి చర్యలకు ఇంతకాలం మెహబూబా ముఫ్తీ కూడా గండికొట్టారు. పూర్తి పాక్ అనుకూల విధానాలను నరనరాన జీర్ణించుకున్న హురియత్ నేతలు కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం చేసిన యత్నాలను ఆదినుంచీ గండికొట్టారు. అక్కడ 370 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకుని ఇంతకాలం హురియత్ నేతలకు తోడు మెహబూబా ముఫ్తీ, అబ్దుల్లాలు పాక్‌తో కలసి దేశ విద్రోహ చర్యలకు పాల్పడుతూ వచ్చారు. ప్రజలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టించారు.అక్కడున్న పండిట్లను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. భారత్‌తో సంబధం లేకుండా కాశ్మీర్‌ను పెంచి పోషించారు. దీనికి ముమ్మాటికీ కాంగ్రెస్‌దే బాధ్యత. 370 రద్దుతో హురియత్ నేతలకు స్థానం లేకుండా పోయింది. అలాగే అక్కడి నుంచి తరిమి వేయబడ్డ వేలాది కాశ్మీర్ పండిట్లతో కూడా సమస్యలు చర్చించడం ద్వారా వారిలో ధైర్యం కల్పించాలి. కాశ్మీర్‌లో అసలు జరుగుతున్నదేమిటో ప్రపంచానికి తెలిసింది. నిజానికి పండింట్లను ముందుగా వారిని తమ స్వస్థలాలకు పంపి రక్షణ కల్పించాలి. వారికి అక్కడే ఉద్యోగ, ఉపాధి కార్యాక్రమాలు కల్పించాలి. ఇప్పుడు అదొక పెద్ద టాస్క్‌గా తీసుకుని, దేశంలో ఎక్కడెక్కో ఉంటున్న పండిట్లను తిరిగి కాశ్మీర్‌కు చేర్చాలి. అక్కడి ముఫ్తీలు,అబ్దుల్లాలే ఒక్కరే కాశ్మీర్ ప్రజలు కాదని గుర్తుంచుకోవాలి. కనీస మర్యాద, గౌరవం లేకుండా తామేదో ఇతర దేశస్థుల మాదిరిగా ఇంతకాలం నేతలు వ్యవహరిస్తూ వచ్చారు. ఇంతకాలం వారి పెడధోరణికి నిదర్శనంగా గుర్తుంచుకోవాలి. విచ్ఛిన్నకర ధోరణితో కాశ్మీర్‌లో మరింత ఆజ్యం పోస్తూ వచ్చారు. వారంతా కావాలని పాక్ కొమ్ముకాస్తూ భారత్‌లో వేర్పాటు వాద కార్యకలాపాలకు మద్దతు పలికారు. వీరంతా తాము అనుకున్న రీతిలో కాశ్మీర్ నడవాలని అనుకున్నారు. పాక్ వీరికి భారత్ వ్యతిరేక ఉగ్రవాదాన్ని నూరిపోస్తోంది. 370 ఆర్టికల్ కాశ్మీర్ అభివృద్ధికి అడ్డుగా నిలవడమే గాకుండా కాశ్మీరీ పండింట్లకు చోటులేకుండా చేసింది. దీనిరద్దుతో ఇప్పుడు పండిట్లు తమ స్వస్థలాలకు చేరుకునే అవకాశం వచ్చినా అది సాకారం కావడం లేదు. కాశ్మీర్ సాధారణ స్థితికి రావాడం జీర్ణించుకోలేని ఉగ్రమూకలు పండిట్లను మళ్లీ లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడుతున్నారు. ముందు పండిట్లను కాశ్మీర్‌లో స్వేచ్ఛగా జీవించే చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే కాశ్మీర్ అందరిదన్న భావన ఉంటుంది. కాశ్మీరీ పండిట్లను జాడ లేకుండా తరిమేసినా గత ప్రభుత్వాలు ఏనాడూ అక్కడ నివారణ చర్యలు తీసుకుని అక్కడి ప్రజలను భారత్‌తో మమేకం చేయలేకపోయింది. రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి విషయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ వచ్చాయి. బిజెపి కఠినంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించడంలో చొరవ తీసుకుంటున్నా దానిని విఫలం చేశారు. పాక్ పాలకులతో స్నేహం పెంచుకోవడం ద్వారా తీవ్రవాద గ్రూపులు కాశ్మీర్‌ను నిత్యం కల్లోల క్షేత్రంగా రగిలిస్తూనే ఉండాలని కొందరు నేతలు కోరుకుంటున్నారు. అందువల్ల ముందుగా కాశ్మీర్ నుంచి తరిమివేయబడ్డ పండిట్లను ఇతర ప్రాంత ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అలా చికిత్సకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే మిగతా వర్గాల ప్రజలు కూడా విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం కొంత కఠిన వైఖరినే కేంద్రం అవలంబించాలి. రాజకీయ లబ్ధికి స్థానిక అవకాశాలను ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా వ్యూహాలు ఉండాలి. నరేంద్రమోదీ ప్రభుత్వం కాశ్మీర్ సమస్య, కాశ్మీర్ పట్ల వివేకవంతమైన వైఖరితో ముందుకు వెళ్లడం స్వాగతించాలి. ప్రధాని మోడీ ప్రయత్నాలు ఫలించాలంటే ప్రతిపక్షం కూడా ఆయనకు బాసటగా ఉండాలి. అయితే పక్కలో బల్లెంలా ఉన్న పాక్ పాలకులు కాశ్మీర్‌లో ఆజ్యం పోస్తూ ఉగ్రవాదులను ఎగదోస్తున్నారు.

# దోచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమిటి

గుంటూరు, జగన్‌కి తండ్రి వైఎస్ రాష్ట్రాన్ని దోచుకోవడం మాత్రమే నేర్పారని, నాయ్యకత్వ లక్షణాలు బోధించలేదని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసి దోచుకున్నారని అన్నారు. అవినీతిపరులే నేడు నీతులు బోధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి రంగంతో సహా అనేక రంగాల్లో అభివృద్ధి తిరోగమనంలో సాగిందన్నారు. హేతుబద్దత లేకుండా రాష్ట్రాన్ని విభజించిన తరవాత చంద్రబాబు అహోరాత్రులు కష్టపడుతూ ఎపిని ముందుకు తీసుకుని పోగా, దానిని వెనక్కి నెట్టే యత్నాల్లో జగన్ ఐదేళ్ల పాలన సాగిందని అన్నారు. తిరి గాడిలో పెట్టి అభివృద్ధిలో పరుగెత్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్న దశలో జగన్‌కి ఏమైనా అభిమానం ఉంటే తగిన విధంగా సహకారం అందించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని అన్నారు. గత పదేళ్లలో చెరువులు ఆక్రమించుకుంటే తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు తిరిగి అభివృద్ధి చేస్తోందని గుర్తు చేశారు. జగన్ పోలవరం సహా అన్నింటిని వెనక్కి మళ్లేంచే యత్నాలతో ఎపిని అధోగతి పాలు చేసిందని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై కోట్ల భారం మోపారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో ఏం అభివృద్ధిచేశారో వైసీపీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. బూటకపు హమీలతో అధికారం చేపట్టారని, తర్వాత వాటిని గాలికి వదలి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. అన్నక్యాంటీన్, నిరుద్యోగ భృతి, ఎస్సీ, బీసీ, ఇతర కార్పొరేషన్లు ద్వారా పథకాలు, విదేశీ చదువులకు ఇచ్చే ప్రోత్సాహకాలు నిలిపివేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేలా ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదన్నారు. హామీలు గుప్పించడం, మభ్యపెట్టడం, ప్రజలు నెత్తిన భారం వేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా నేతల్లో మార్పు కానరావడం లేదన్నారు. వైసీపీ పాలనలో ఊరికో ఉన్మాది తయారయ్యారని.. ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే కిరాతకులు పెట్రేగారని అన్నారు.

అభివృద్ది దిశగా తెలంగాణ పథకాలు

కరీంనగర్,దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో బృహత్తరమైన పథకాలు ప్రవేశపెట్టి ఏ ప్రభుత్వమూ ఎన్నడూ చేయని అభివృద్ధిని సిఎం రేవంత్ రెడ్డి చేసి చూపుతున్నారని ఎమ్మెల్యే, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాల్లో దళితులకు పెద్దపీట వేస్తూ వారికి సహకారం అందిస్తున్నామని అన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం అమలు చేయబోతున్నారని గుర్తుచేశారు. ఇకపోతే ధాన్యం కొనుగోళ్లకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని వెల్లడించారు. మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ప్రభుత్వ భూముల కబ్జాను సహించం

నెల్లూరు, ప్రభుత్వ భూములు ఆక్రమించాలన్న ఆలోచన మానుకోవాలని మంత్రి నారాయణ హెచ్చరించారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని మంత్రి పొంగూరు నారాయణ వార్నింగ్ ఇచ్చారు.. నెల్లూరు సిటీ అభివృద్ధిపై అధికారులు, కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు, కో–ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి.. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. త్వరలోనే సిటీ– నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడా ఆగటం లేదని స్పష్టం చేశారు.. ఇక, రాష్ట్రంలో 68 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.. 32 వేల కోట్లు– ప్రభుత్వానికి ఖర్చు అవుతోంది.. నిబంధనల ప్రకారం అనర్హుల కార్డులు మాత్రమే తొలగిస్తున్నామని వెల్లడించారు.. కానీ, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని.. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాలని పట్టించుకోవద్దని మంత్రి పొంగూరు నారాయణ సూచించారు..

# నందిగం సురేశ్‌కు జూన్ 2వరకు రిమాండ్

గుంటూరు, వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు జూన్ 2 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త రాజుపై దాడి చేసిన కేసులో ఆదివారం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టులో హాజరుపరచడానికి ముందు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నందిగం సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం స్థాయిలను పరీక్షించారు. సురేశ్‌ను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు– చేశారు. కోర్టు ప్రాంగణంలో ఇతరులను ఖాళీ చేయించారు. ఆయన అనుచరులు భారీగా చేరుకోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. 14 రోజుల పాటు రిమాండ్ విధించింది న్యాయస్థానం. దీంతో నందిగం సురేష్‌ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే పలు కేసులలో వైసీపీ మాజీ ఎంపీ బెయిల్‌పై ఉన్నారు. సోమవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో మాజీ ఎంపీని పోలీసులు హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్ విధించింది.గత శనివారం రాత్రి మాజీ ఎంపీ స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో టీడీపీ కార్యకర్త రాజు అనే వ్యక్తిపై నందిగం సురేష్, అతడి సోదరుడు, అనుచరుడు మూకుమ్మడి దాడి చేశారు. తన భర్తపై హత్యాప్రయత్నం చేశారంటూ రాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. రాజును కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు– నిర్ధారించి నందిగం సురేష్‌తో పాటు– మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు. నిన్న (ఆదివారం) సురేష్‌ను తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఈరోజు (సోమవారం) మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. సురేష్‌కు కోర్టు 14 రోజుల పాటు– రిమాండ్ విధించగా.. వెంటనే అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. నెలల తరబడి నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో మరియమ్మ అనే మహిళ హత్య కేసు, తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కూడా అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు మాజీ ఎంపీపై 12 కేసులు ఉండగా.. ఇప్పుడు 13వ కేసు నమోదు అయినట్లు– తుళ్లూరు డీఎస్పీ తెలిపారు. మరో రెండు కేసులు నమోదు అయితే నందిగం సురేష్‌పై పీడీ యాక్ట్ పెట్టేందుకు సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎయిర్ బేస్‌పై డ్రాగన్ కన్ను..

న్యూఢిల్లీ, భారత్ టార్గెట్ గా బంగ్లాదేశ్ చైనాతో చేతులు కలుపుతోందా? ఈశాన్య రాష్ట్రాలపై డ్రాగన్ కన్నేసిందా? ఓవైపు పాక్ కయ్యానికి కాలు దువ్వుతుంటే.. చైనా సైలెంట్ గా బంగ్లాతో కలిసి పావులు కదుపుతోంది. ఇప్పటికే పాక్ తో కలిసి కశ్మీర్ లో ఇబ్బందులు కలిగిస్తున్న చైనా.. ఈశాన్య రాష్ట్రాలపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఇందులో బంగ్లాదేశ్ ను డ్రాగన్ కంట్రీ పావుగా వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. భారత్ ను దెబ్బతీసేలా బంగ్లాదేశ్ లో రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్ బేస్ ను అభివృద్ధి చేసే దిశగా చైనా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఈశాన్య రాష్ట్రాలపై డ్రాగన్ కంట్రీ కన్నేయాలని చూస్తోంది. ఎప్పుడో రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్ బేస్ ను అభివృద్ధి చేయాలని చూస్తోంది. ఒకవేళ చైనా ఈ ఎయిర్ బేస్ ను అభివృద్ధి చేస్తే భారత్ కు ఇబ్బందులు తప్పవు. ఇది భారత దేశ భద్రతకు పెద్ద ముప్పుగా మారనుంది. చైనా, బంగ్లాదేశ్ లు అభివృద్ధి చేసే ఎయిర్ బేస్ వెస్ట్ బెంగాల్ కు సరిహద్దుకు సిలిగురి కారిడార్ కు సమీపంలో ఉంటుంది. ఈ సిలిగురి కారిడార్ భారత్ లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను కలుపుతుంది. ఈ ఏడు రాష్ట్రాలను సెవెన్ సిస్టర్స్ గా పిలుస్తారు. ఈ కారిడార్ చైనా, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ లతో సరిహద్దులను పంచుకుంటుంది. ఇది భారత్ కు అత్యంత కీలకం. ఇక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా భారత్ తో మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు వేరవుతాయి. సిలిగురికి సమీపంలో బంగ్లాదేశ్ లోని లాల్ మోనిర్ హట్ వైమానిక స్థావరాన్ని పునరుద్ధరించడంలో చైనా సాయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ తన వైమానిక స్థావరాన్ని అభివృద్ధి చేయడంలో చైనా తన పనులను ముమ్మరం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ఎయిర్ బేస్ ను చైనా పూర్తి చేస్తే భవిష్యత్తులో భారత్ కు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇటీవలే చైనా అధికారులు ఈ ఎయిర్ బేస్ ను సందర్శించినట్లు సమాచారం. ఇక్కడ కనుక చైనా లాల్ మోనిర్ హట్ ఎయిర్ బేస్ ను పునరుద్ధరిస్తే.. ఇది భారత సైనికుల కదలికలను పర్యవేక్షించడానికి లేదా నిఘాను సేకరించేందుకు వీలు కల్పిస్తుంది. ఈ ఎయిర్ బేస్ దక్షిణాసియాలో చైనా తన ప్రాభవాన్ని విస్తరించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎయిర్ బేస్ వల్ల బంగ్లాదేశ్ కు ప్రయోజనాలు ఉన్నా.. భారత్ కు భవిష్యత్తులో ముప్పు వచ్చే ప్రమాదం ఉంది. మున్ముందు చైనా ఈ స్థావరాన్ని పరోక్షంగా తన సైనిక కార్యకలాపాల కోసం ఉపయోగించే అవకాశం ఉందని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## మిర్చి రైతులకు స్టోరేజీలను ఇవ్వాలి

గుంటూరు: మిర్చి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గిపోతుందని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుందామంటే వాటి యజమానులు కూడా ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచారని జిల్లా రైతు సంఘం నాయకులు విమర్శించారు. అక్రమంగా వసూళు చేస్తున్నా అధికారులు, పాలకవర్గం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధిక కమీషన్, మచ్చుల పేరుతో మిర్చియార్డులో అధిక వసూళ్ల దోపిడీని అరికట్టాలని అన్నారు. ఇప్పటినుంచే చర్యలు తీసుకుని వచ్చే మార్కెట్ నాటికి పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సన్న, చిన్నకారు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, మార్క్‌ఫెడ్‌కు వేయి కోట్లు కేటాయించి కొనుగోళ్లు ప్రారంభించాలని అన్నారు. అలాగే కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

# కల్వకుంట్ల కవిత.. మరో వైఎస్ షర్మిల అవుతారా?

హైదరాబాద్,కుటుంబ పార్టీల్లో ఆప్యాయంగా పలకరించుకున్న అప్పులే శత్రులవుతారు! వారి మధ్య ఆమడదూరం పెరుగుతుంది! కుటుంబ పార్టీపై పెత్తనంలో భాగస్వామ్యం కోరుకోవడంతో మొదలయ్యే ఈ ఆధిపత్యపోరు.. ఆఖరుకు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే స్థితికి చేరుకుంటుందనేందుకు దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీల్లో ఉదాహరణలు ఉన్నాయి. పొరుగున తోటి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇది చూసిందే! ఇప్పుడు తెలంగాణ వంతు వస్తుందా? కల్వకుంట్ల కుటుంబ సభ్యురాలిగా.. బీఆరెస్ ముగ్గురు ముఖ్యనేతల్లో ఒకరిగా ఉన్న కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత షర్మిల అడుగుజాడల్లో నడుస్తారా? ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదొక ఆసక్తికర అంశంగా రాజకీయ చర్చల్లో చోటుచేసుకుంటున్నది. ఆంధ్రప్రదేశ్‌లో తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో ఆయన అధికారంలోనే ఉన్న సమయంలో విభేదించిన షర్మిల.. సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆస్తి తగాదాలతోపాటు.. అధికారంలో భాగస్వామ్యం కోసం చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో అన్నతో వేరుపడ్డారు. తర్వాతి కాలంలో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనంచేసి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా ఆ పార్టీకి రాష్ట్ర చీఫ్‌గా ఎదిగారు. గత ఎన్నికల్లో అటు తన అన్నకు చెందిన వైసీపీతోపాటు.. నాటి ప్రతిపక్షం టీడీపీపై పోరాటం చేశారు. ఇప్పటికి ఇంత జరుగకున్నా.. తెలంగాణలో కేసీఆర్ కుమార్తె అడుగులు.. ఆమె షర్మిల బాటలోనే పయనిస్తారా? అనే సందేహాలకు తావిస్తున్నాయి. ఇక్కడా అధికారంలో భాగస్వామ్యం ఒక ఎత్తయితే.. అస్తిత్వం అనేది మరో అంశంగా ఉన్నది. బీఆరెస్ పార్టీకి తెలంగాణ జాగృతి కూడా ఒక అనుబంధ సంస్థ. కానీ.. ఒక పార్టీకి ఉండేలా తెలంగాణ జాగృతికి కూడా కమిటీలను, కన్వీనర్లను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపింది. పార్టీలో తనను దూరం పెడుతున్నారన్న వార్తల నేపథ్యంలో అధికారం, అస్తిత్వం కోసం కవిత తన సోదరుడు కేటీఆర్‌తో విభేదించారా? తండ్రి కేసీఆర్‌ను కాదని సమరానికి సై? అన్నారా? అనే చర్చలు సాగుతున్నాయి. ఒక సంస్థగా జాగృతిని బలోపేతం చేయడం వేరు.. దానికి కొన్ని శాఖలను పెట్టుకుని విస్తరించే ప్రయత్నం చేయడం వేరని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

తీహార్ జైలు నుంచి వచ్చాక కొంత మౌనం!

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో రిమాండ్ ఖైదీగా తీహార్ జైలులో ఐదు నెలల పాటు కవిత ఉన్నారు. గతేడాది ఆగస్టులో సుప్రీంకోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేయడంతో హైదరాబాద్ చేరుకున్న ఆమె.. కొద్ది నెలలు మౌనం దాల్చారు. బంజారాహిల్స్‌లోని తన ఇంటితో పాటు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఐదు నెలలపాటు జైల్లో ఉన్నందుకేమో.. ఆరోగ్యం దెబ్బతినడంతో మరింత ఆందోళనకు గురయ్యారని, రాజకీయంగా తన పరిస్థితిపై ఆలోచనలు చేస్తూ తీవ్ర మథనానికి గురయ్యారని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. తనకు సన్నిహితంగా ఉన్న కొందరితో చర్చలు కూడా జరిపిన తరువాత ప్రజాక్షేత్రంలోనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. గతేడాది డిసెంబర్ నెలలో నిజామాబాద్ జిల్లాలో పర్యటనలతో కవిత యాక్టివేట్ అయ్యారు. రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టారు. దారి పొడవునా తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తూ.. కార్యకర్తలతో మాట్లాడుతూ మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చారు. పనిలోపనిగా డిసెంబర్ 4వ తేదీ నుంచి జిల్లాలవారీగా జాగృతి సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నారు. రాజకీయ కార్యక్రమాలతో పాటు ఆత్మీయ సమ్మేళనాలు, ముఖ్య కార్యకర్తల కుటుంబాలకు పరామర్శలు చేస్తున్నారు. ఒక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి స్థాయిలో ఎక్కడా తగ్గకుండా మీడియా సమావేశాలు నిర్వహించి, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలన ఎలా ఉండేదని ప్రజలను అడిగి తెలుసుకునేవారు. అయితే ఈమె చేస్తున్న పర్యటనలు పార్టీకి మేలు చేస్తున్నాయో కీడు చేస్తున్నాయో అర్థం కాక సీనియర్లు తలలు పట్టుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక వాదంతో రేవంత్ రెడ్డి సర్కారును ఇరుకున పెడుతుంటే కవిత మరో వాదనతో మీడియా ముందుకు వస్తుండటం మంచిది కాదనే వాదన రాజకీయవర్గాల్లో మొదలైంది. పార్టీ ప్రయోజనం కోసమే సగానికి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించానని, మరో ఉద్దేశం లేదని ఆమె చెప్పుకుంటున్నా వేరే కారణాలే ఉన్నాయనే అభిప్రాయా లే వ్యక్తమయ్యాయి. తనపై అసత్య, కల్పిత ప్రచారాలు జరుగుతున్నా పార్టీ నుంచి సరైన స్పందన లేదని ఆమె తన సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం.

దూకుడుతో దూరం పెట్టిన నాయకత్వం

ఇదిలా ఉండగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కుమార్ చేతిలో 2019లో ఓటమి పాలైన తర్వాత కవిత రెండేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఈ పరిణామంతో తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్ ఆమెను పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టారు. నిజామాబాద్ జిల్లాలో క్వీన్ అనే స్థాయిలో తన అధికార దర్పాన్ని ప్రదర్శించిన విషయం తెలిసిందే. చాలా సందర్భాల్లో జిల్లా అధికారులు అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని కాదని ప్రొటోకాల్ ఇచ్చి రాచమర్యాదలు కల్పించేవారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈమె దూకుడుతనంతో ఇద్దరూ నొచ్చుకుని, పార్టీ అధినేతకు




మొరపెట్టుకున్నారని సమాచారం. జిల్లాలోని ముఖ్య నాయకుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా కవితను బీఆరెస్ కార్యక్రమాలకు దూరం పెట్టారన్న చర్చ జరిగింది. ఏమైందో ఏమో కానీ ఆమెను పెద్దల సభకు పంపించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఎంపీగా ఓటమి పాలైన రెండేళ్ల తరువాత ఎమ్మెల్సీగా కవిత మళ్లీ క్రియాశీలకంగా మారారు. ఇక అప్పటి నుంచి గతేడాది ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తీహార్ జైలుకు వెళ్లే వరకు అదే దూకుడుతో పనిచేశారు. జైలు నుంచి వచ్చిన తరువాత తండ్రి కేసీఆర్ ఆమెను సముదాయించి, ఓదార్చినప్పటికీ రాజకీయంగా అంతగా ప్రాధాన్యం, ప్రాముఖ్యం ఇవ్వడం లేదన్న వాదనలు ఉన్నాయి. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కుమారుడు కేటీఆర్, ఇతర ముఖ్య నాయకులతో చర్చిస్తున్నారని అప్పట్లోనే వార్తలు వచ్చాయి. తండ్రితో పాటు అన్న కూడా తన పట్ల వివక్ష చూపుతున్నట్టు గ్రహించిన ఆమె సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అయితే ఇటీవల వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కవిత ఫోటోలు కన్పించకుండా చేశారనే విమర్శలు ఉన్నాయి. సభా వేదిక ఖరారులో తన ప్రమేయం లేకపోవడం వంటి ఘటనలతో ఆమె మరింతగా ఆవేదన చెందారని తెలుస్తున్నది. ఇవి చదువుతుంటే.. సహజంగానే ఏపీలో షర్మిల, జగన్మోహన్‌రెడ్డి మధ్య పంతాలు పట్టింపులు, ఆస్తి, అధికార తగాదాలు గుర్తురాకమానవు. సోదరుడు జగన్‌తో విభేదించిన షర్మిల.. 'కొత్త రాజకీయ జీవితం' కోసం తెలంగాణ వచ్చారు. అధికారం, ఆస్తి కోసం సోదరుడితో అంతర్గతంగా పలుసార్లు పంచాయతీ పెట్టినా.. ఆయన ఖాతరు చేయకపోవడంతో తన తండ్రి పేరిట తెలంగాణలో పార్టీ పెట్టారు. కొద్ది నెలల పాటు తెలంగాణలో కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం, పరాయి రాష్ట్రం నాయకురాలిగా గుర్తింపు పొందడం, ముఖ్య నాయకులు నమ్మకపోవడంతో ఆమె తిరిగి ఏపీకి వెళ్లక తప్పలేదు. తెలంగాణలో రేవంత్ రెడ్డి బలం పుంజుకోవడంతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకుని, ఏపీకి పీసీసీ అధ్యక్షురాలు అయ్యారు. కాగా కల్వకుంట్ల కవిత పరిస్థితి ఒకే విధంగా ఉన్నప్పటికీ లక్ష్యాలు వేర్వేరు కావడం గమనించాల్సిన అంశం. తెలంగాణ ఉద్యమం నుంచి పోరాడుతున్న తనకు రాను రాను ప్రాధాన్యం, ప్రాముఖ్యం తగ్గిస్తున్నారనేది ఆమె వాదనగా చెబుతున్నారు. ఇన్నేళ్లు పోరాడిన తనకు అస్తిత్వంతో పాటు అధికారమే ముఖ్యమని ఆమె కొన్ని నెలలుగా చేస్తున్న పర్యటనలు చెప్పకనే చెబుతున్నాయి. అమెరికాలో కుమారుడి డిగ్రీ పట్టా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే ముందు తెలంగాణ జాగృతి అనుబంధ సంఘాలకు కన్వీనర్లను నియమించారు. సాధారణంగా రాజకీయ పార్టీల్లో అనుబంధ సంఘాలు, కార్యవర్గం ఉంటుంది. జాగృతి అనేది రాజకీయ పార్టీ కాదు కదా ఒక సాంస్కృతిక సంస్థ మాత్రమే. అలాంటి సాంస్కృతిక సంస్థలకు సైతం విభాగాల వారీగా కన్వీనర్లను నియమించడం ఆసక్తి రేపింది. తండ్రి, సోదరుడితో తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధమయ్యి వ్యూహాత్మకంగానే ఆమె అడుగులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వాట్ నెక్ట్స్?

అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తరువాత కవిత జాగృతిని రాజకీయ పార్టీగా మారుస్తారా? లేక ఆ సంస్థను గ్రామ స్థాయినుంచి మరింత బలోపేతం చేస్తారా? అనేది పలువురు ఎదురు చూస్తున్నారు. నిజానికి తనను పార్టీలో దూరం పెడుతున్న విషయాన్ని గమనించిన కవిత.. సొంతగానే పార్టీ పెట్టేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే తన విషయంలో జరుగుతున్న అన్యాయం, నిర్లక్ష్యంపై తన తండ్రి కేసీఆర్ కు లేఖ రాశారని అంటున్నారు. ఆ లేఖలో తన సోదరుడి వ్యవహారంపై పలు ప్రశ్నలు సంధించారంటున్నారు. పార్టీ స్థాపన నుంచి ఈ రోజు వరకు తాను చేసిన కృషి, కేటాయించిన సమయం, విస్తరణలో తన పాత్ర, 2014 తో పాటు 2018 ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం శక్తియుక్తుల ధారపోత వంటి అంశాలను ప్రస్తావించి, ఈ మధ్య తనను దూరం పెట్టడానికి గల కారణాలు ఏంటని ఆ లేఖలో లేవనెత్తారని తెలిసింది. మహిళలను పార్టీవైపు తిప్పుకోవడంలో పనిచేసినా తగిన గుర్తింపునివ్వడం లేదనే ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని ఆమె ప్రజా క్షేత్రంలోనే తన భవిత, బతుకు తేల్చుకోవాలనే ధృడ సంకల్పంతో ఉన్నట్లు చర్యలను బట్టి అవగతమవుతోంది.

# సేంద్రీయ ఎరువులతోనే లాభం

నిజామాబాద్,రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మట్టిలో పోషకాలను పెంచేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయా అధికారులు రైతులకు సూచించారు.. రసాయన ఎరువుల వినియోగం పెరిగి భూమికి తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. అన్నదాతలు ఈ విషయాన్ని గుర్తించి రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. రైతన్నలు మట్టిని కాపాడితే సమాజాన్ని కాపాడినవారు అవుతారన్నారు. అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం కోల్పోయి పంట నాణ్యత హీనంగా వస్తుందన్నారు. తద్వారా ఆ పంటను స్వీకరించిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు,. వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయించుకుని రైతులు తమ పొలాల్లో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోవచ్చన్నారు. అవసరమైనంత మేరకు నత్రజని పోటాష్‌లు, వినియోగించాలన్నారు అంతేకాకుండా భూమి యొక్క బౌతిక రసాయన స్థితిని బట్టి ఆభూమిలో ఏయే పంటలు పండుతాయి అనే విషయాన్ని కూడా తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. అధిక మొత్తంలో రసాయనాలు వాడి భూమిలోని పోషకాలు తగ్గించకుండా భూమిని జాగ్రత్తగా కాపాడు కోవాల్సిన అవసరం రైతులపై ఉందన్నారు. భూసారం తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగానే తెలుసుకుని వాటిని అవలంబించాలన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన పంటు పండే అవకాశం ఉందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలను భూమి ఇస్తుందని భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్మికంపోస్ట్ సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. ఇదిలావుంటే మండల స్థాయిలో, గ్రామీణ స్థాయిలో కూడా ప్రైవేట్ వ్యక్తులు మట్టి తవ్వేందుకు ప్రయత్నాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను అధికారులను పాటించాలన్నారు. వర్మికంపోస్టు యూనిట్లు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యాన పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడేందుకు ప్రభుత్వం రాయితీపై వర్మీకంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రధానంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయల పంటలలో రసాయనాల వాడకం తగ్గించడం ద్వారా ప్రజలకు మేలైన కూరగాయలు అందేలా చేయాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగులో కంపోస్టు ఎరువుల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ముందుగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన రైతులకు రాయితీపై వర్మికంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఉద్యానశాఖ అధికారి తెలిపారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వ్యక్తిగత మరుగుదొడ్ల పై నిర్లక్ష్యం

విజయనగరం,దేశవ్యాప్తంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రచారం ఉధృతం చేసినా ఆశించన లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. గ్రామసీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. దీనికి తోడు పరిశుభ్రతకు సంబంధించిన పనులు తమకు సంబందించినవి కావన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు' ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి ఏళ్లు గడిచాయి. గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేందప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. ఏపీలో ఇప్పటికే లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి ఏర్పాటుతో పాటు వినియోగమూ ముఖ్యమంటూ వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాథమ్యంగా ప్రకటించింది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది.అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు తీసుకోవాలి. స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం. ప్రజల్లో నిర్లిప్తత తొలగాలి. పరిశుభ్రత పాటించకపోతే వ్యక్తిగతంగా తమకు, తద్వారా సమాజానికి చేటు జరగుతుందన్న విషయం ప్రచారం చేయాలి. ప్రజలను నిరంతర చైతన్యం చేయడం ద్వారానే సంపూర్ణ స్వచ్ఛత సాధించగలమని గుర్తించాలి.

# 'భోగ్ భూమి" కాదు..

గోవా:సాధారణంగా కాస్త లాంగ్ వీకెండ్ వచ్చినా, హాలిడేస్ లో బాగా ఎంజాయ్ చేయాలని భావించినా, సముద్ర తీరంలో సూర్యోదయాన్ని మరింత కొత్తగా ఆస్వాధించాలని అనుకున్నా ఎక్కువమంది యువత గోవాను ఒక బెస్ట్ ఆప్షన్ గా ఎంచుకుంటారని అంటారు. అయితే అది ఒకప్పుడు.. ఇప్పుడు గోవా బీచ్ ల కంటే ఎక్కువగా దేవాలయాలు, సంస్కృతి విషయంలో ఎక్కువమందిని ఆకర్షిస్తోందని అంటున్నారు సీఎం ప్రమోద్.అవును... గోవా ఒకప్పుడైతే సూర్యుడు, ఇసుక, సముద్రాన్ని ఎంజాయ్ చేస్తూ ఆనందించడానికి వచ్చేవారని అయితే.. ఇప్పుడు మాత్రం దేవాలయాలు, సంస్కృతి కోసం ఎక్కువమందిని గోవా ఆకర్షిస్తోందని.. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అన్నారు. ఈ సందర్భంగా గోవా ఇప్పుడు "భోగ్ భూమి" (ఆనంద భూమి) కాదు.. "యోగ భూమి" (భక్తి, యోగా భూమి), "గో మాత భూమి" (ఆవుల భూమి) అని అన్నారు.ఇదే సమయంలో... ఒకప్పుడు గోవాకు ప్రజలు వచ్చినప్పుడల్లా ఇది భోగ్ భూమిగానే అనుకునేవారు కానీ.. ఇది ఇప్పుడు యోగ భూమి అని అన్నారు. ఇక్కడ సనాతన సంస్థ ఆశ్రమం కూడా ఉందని తెలిపారు. తాజాగా "సనాతన రాష్ట్ర శంఖనాద్ మహోత్సవ్" కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది పరశురాముడి భూమి అని నొక్కి చెప్పారు.ఈ సందర్భంగా... విష్ణువు అవతారమైన పరశురాముడు అరేబియా సముద్రంలోకి బాణం వేసి, దాన్ని వెనక్కి నెట్టి గోవాని సృష్టించారని ముఖ్యమంత్రి సావత్ అన్నారు! ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రాష్ట్రంలోని బీచ్ ల కంటే శుభ్రమైన, అందమైన దేవాలయాలు ఎక్కువమందిని ఆకర్షిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలను స్థానిక సమాజాలే నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.సనాతన్ సంస్థ వ్యవస్థాపకుడు జయంత్ అథవాలే 83వ జయంతి సందర్భంగా ప్రసంగించిన సావంత్... గతంలో ప్రజలు సూర్యుడు, ఇసుక, సముద్రం చూడటానికి గోవాను సందర్శించేవారని.. అయితే, ఇప్పుడు అది మారిందని. ఇప్పుడు పర్యాటకులు మన గొప్ప సంస్కృతి, దేవాలయాలను అనుభవించడానికి ఇక్కడికి వస్తున్నారని తెలిపారు!

# అమరావతిలో గలీజు పని...



అమరావతి,అమరావతిలోని సీఆర్‌డీఏ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఓ కీలక గనులశాఖ అధికారి తన తోడల్లుడికి మైనింగ్ లీజు ఇప్పించేందుకు ప్రయత్నించాడు. ఉన్నతాధికారి బ్రేక్ వేయడంతో వ్యవహారం సీఎంఓ దాకా వెళ్లి, సంబంధిత అధికారికి షోకాజ్ జారీ చేశారు.గనుల శాఖలోని ఓ కీలక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా తన తోడల్లుడికి అమరావతిలో మైనింగ్ లీజు ఇప్పించాలని ప్రయత్నించారు. ఈ ప్రతిపాదనకు ఓ ఉన్నతాధికారి బ్రేక్ వేయడంతో విషయం ముఖ్యమంత్రి కార్యాలయం దాకా వెళ్లింది. ప్రతిపాదన పంపిన అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. రాజధాని నిర్మాణం కోసం గుంటూరు జిల్లాలో రోడ్ మెటల్, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మైనింగ్ లీజులను అమరావతి నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీలకు ఇచ్చేలా, వాటికి మాత్రమే మెటీరియల్ పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అమరావతి పనుల్లో వేగం పెరిగాక రోడ్ మెటల్, గ్రావెల్ కొరత రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయం తెలిసి కూడా గనుల శాఖలోని కీలక వ్యక్తి తన తోడల్లుడికి మైనింగ్ లీజు ఇప్పించాలని చూశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ అధికారితో ఈ మేరకు ప్రతిపాదన పంపించారు. ఇది చూసి గనుల శాఖ ఉన్నతాధికారి కంగుతిన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. లీజు ప్రతిపాదన వ్యవహారంలో కీలక వ్యక్తి వద్ద మొన్నటి వరకు పనిచేసిన ఓ రిటైర్డ్ అధికారి పాత్ర ఉన్నట్లు సమాచారం.

నిబంధనలు ఉల్లంఘించి..

అమరావతిలో నిర్మాణ పనులు ఊపందుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వర్కల కోసం భారీగా రోడ్ మెటల్, గ్రావెల్ అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో అమరావతి పరిధిలో మైనింగ్ లీజులు, ప్రత్యేకించి రోడ్ మెటల్, గ్రావెల్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో, ప్రత్యేకంగా సీఆర్‌డీఏ జోన్‌లో అమరావతి నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీలకే లీజులు లేదా సరఫరా కాంట్రాక్టు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అది కూడా నామినేషన్ ప్రాతిపదికన ఇవ్వాలని ఆదేశించింది. దీని ప్రకారం అమరావతి నిర్మాణ పనులు చేయని కంపెనీలకు, వ్యక్తులకు మైనింగ్ లీజులు, సబ్ లీజులు ఇవ్వడానికి వీల్లేదు. అయినా గనుల శాఖలోని కీలక వ్యక్తి తన తోడల్లుడికి అమరావతిలో సివిల్ వర్కులు ఇప్పించాలనుకున్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలోని రోడ్‌మెటల్, గ్రావెల్ లీజులను తోడల్లుడికి చెందిన కంపెనీకి ఇవ్వాలని గుంటూరు గనుల అధికారి వద్ద దరఖాస్తు ఇప్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ కంపెనీకి నామినేటెడ్ ప్రాతిపదికన లీజులు ఇచ్చే అవకాశమే లేదు. కనీసం ఆ కంపెనీ దరఖాస్తును కూడా స్వీకరించకూడదు. కానీ గనుల అధికారి అవేవీ పాటించలేదు. దరఖాస్తును పరిగణనలోకి తీసుకొని, ఆ కంపెనీకే 22–1లోని లీజులు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. అయితే ఆ కంపెనీ అమరావతి పరిధిలో ఏ వర్కులు చేస్తుందో పొందుపరచలేదు. ఈ ప్రతిపాదనపై అనుమానం వచ్చి గనుల ఉన్నతాధికారి సమగ్ర విచారణ చేశారు. సంబంధిత అధికారిని పిలిచి మాట్లాడినట్లు తెలిసింది.

# 3 రోజుల్లో 11 మంది పాక్ గూఢచారుల అరెస్ట్...



న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత భద్రతకు సంబంధించి పాకిస్థాన్‌కు సున్నిత సమాచారం అందిస్తున్న 11 మందిని పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వారిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, సెక్యూరిటీ గార్డు, యాప్ డెవలపర్, విద్యార్థులు ఉన్నారు.

పంజాబ్, హరియాణా, యూపీలో అదుపులోకి

న్యూఢిల్లీ,పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత పాక్ గూఢచర్య కార్యక్రమాల్లో పాల్గొన్న వారిపై పోలీసులు దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. గడిచిన మూడు రోజుల్లోనే 11 మంది 'పాక్ గూఢచారుల'ను అరెస్ట్ చేశారు. భారతదేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో హరియాణాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాతోపాటు ఓ సెక్యూరిటీ గార్డు, యాప్ డెవలపర్, విద్యార్థులు, సామాన్యులు ఉన్నారు.

గజాలా, యమీన్: జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన 32 ఏళ్ల వితంతువు గజాలా, యమీన్ మహమ్మద్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. యమీన్ ఆర్థిక కార్యకలాపాలు, వీసా సంబంధిత అంశాల్లో పాక్ హైకమిషన్ మాజీ ఉద్యోగి డానిషతో కలిసి పనిచేసినట్లు పోలీసులు తెలిపారు.

తారిఫ్: నుహ్‌కే చెందిన తారిఫను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పాకిస్థాన్ రాయబార కార్యాలయానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తనకు సిమ్ కార్డులు అందించినట్లు విచారణలో చెప్పాడన్నారు. అతను తరచుగా పాకిస్థాన్ వెళ్లేవాడు.

నౌమాన్ ఇలాహీ: ఐఎసఐ ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతున్న నౌమాన్ ఇలాహీ(24)ని పానిపట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను యూపీకి చెందినవాడు. ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడని, పాక్‌కు సున్నిత సమాచారాన్ని చేరవేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఇలాహీ చాలాసార్లు పాక్ పర్యటనకు వెళ్లాడన్నారు.

మహ్మద్ ముర్తజా అలీ: పంజాబ్‌లోని జలంధర్‌లో యాప్ డెవలపర్ మహ్మద్ ముర్తజా అలీని పోలీసులు అరెస్టు చేశారు. అతను స్వయంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ ద్వారా గూఢచర్య కార్యకలాపాలను నిర్వహించాడని చెప్పారు.

దేవేందర్ సింగ్: పంజాబ్ పటియాలాలోని ఖల్సా కళాశాలకు చెందిన 25 ఏళ్ల పొలిటికల్ సైన్స్ విద్యార్థి. పటియాలా సైనిక కంటోన్మెంట్ చిత్రాలతో పాటు ఇతర కీలక సమాచారాన్ని ఐఎసఐ ఏజెంట్లకు అందించినట్లు పోలీసులు తెలిపారు. నవంబర్‌లో పాకిస్థాన్ వెళ్లి వచ్చాడని చెప్పారు.

షెహజాద్: ఉత్తరప్రదేశ్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు షెహజాద్‌ను అరెస్టు చేశారు. ఇతను పాకిస్థాన్‌కు అనేకసార్లు వెళ్లాడని, సౌందర్య సాధనాల స్మగ్లింగ్ రాకెట్‌ను గూఢచర్య కార్యకలాపాల కోసం వినియోగించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఐఎసఐ ఏజెంట్లతో ఇతనికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వివరించారు.సుఖ్‌ప్రీత్ సింగ్: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని అందజేశారనే ఆరోపణలతో పంజాబ్ పోలీసులు గురుదాసపూర్‌లో సుఖ్‌ప్రీత్ సింగ్‌ను అరెస్టు చేశారు. పంజాబ్, హిమాచల్, కశ్మీర్‌లో భారత దళాల కదలికలతోపాటు వ్యూహాత్మక ప్రదేశాల వివరాలను నిందితుడు ఐఎసఐకి చేరవేసినట్లు పంజాబ్ డీజీపీ తెలిపారు.కరణ్‌బీర్ సింగ్: గురుదాసపూర్‌లోనే మరో నిందితుడు కరణ్‌బీర్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఇతనికి ఐఎసఐ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని.. మన సైనిక బలగాలకు చెందిన సున్నిత సమాచారాన్ని వారికి చేరవేశాడని పోలీసులు తెలిపారు.అర్మాన్: మరో గూఢచారి, నుహ్‌కు చెందిన అర్మాన్(26)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతని ఫోన్ నుంచి పాక్ నంబర్లతో జరిపిన సంభాషణలు, పంపిన ఫొటోలు, వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. భారత సైనిక కార్యకలాపాల వివరాలను వాట్సాప్ ద్వారా పంపాడన్నారు.జ్యోతి మల్హోత్రా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పాక్ ఏజెంట్లు తమకు కీలకమైన వ్యక్తిగా మార్చుకున్నారని పోలీసులు తెలిపారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట ఆమె యూట్యూబ్ చానెల్ నడుపుతోందని, 3.85 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారని చెప్పారు. ఆమె 2023, 2024, 2025 మార్చిలో పాకిస్థాన్ వెళ్లి వచ్చిందని.. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా పాక్‌కు వెళ్లిందని వివరించారు. భారత్‌లోని పాక్ హైకమిషన్ ఉద్యోగి డానిషతో సంప్రదింపులు జరిపిందన్నారు.

# పంచాయితీలను ఆర్థికంగా ఆదుకోవాలి




హైదరాబాద్, పంచాయితీరాజ్ చట్టాన్ని బలోపేతం చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కులవృత్తులను,గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొదిస్తే తప్ప మార్పు కానరాదని పలువురు ప్రముఖులు చెబుతున్నారు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని అంటున్నారు. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. పల్లెల్లో ఏ పనులు చేయాలో సిఎం స్థాయిలో అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది. గ్రామాల్లో సర్పంచ్‌ల బాధ్యత నామమాత్రంగా ఉంటోంది. వారికి బాధ్యత అప్పగిస్తే పన్నుల వసూళ్లు మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించిన ప్రభుత్వం నిధుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో పన్నులు ఇతరత్రా రూపంలో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగితే తప్ప నిధులు సమకూరవు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. ఎన్నికలకు ముందే ఇవన్నీ నిర్ధారించాలి. తెలుగు రాష్ట్రాల సిఎంలు ఇందుకు పూనుకోవాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి. గ్రామాల నిధులు గ్రామాలకే చెందేలా చేయాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించేలా చేస్తే నిధుల దుర్వినియోగం తప్పుతుంది. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేస్తే పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవాల్సిన అసవరం ఉంది. ఇలాచేస్తే కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏ పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి ఊరట కలుగనుంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని పలువురు రాజకీయ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. దీనివల్ల పల్లెలు పరిశుభ్రంగా మారతాయి. పంచాయతీలకు ఆర్థికభారం తప్పుతుంది.గ్రామ పంచాయతీల్లో ఇదివరకే డంపింగ్ యార్డుల నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేపడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. అలాగే చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

# సీఎం చంద్రబాబుపై బిల్ గేట్స్ ప్రశంసల వర్షం..

అమరావతి, ఏపీ సీఎం చంద్రబాబును ప్రశంసిస్తూ బిల్ గేట్స్ లేఖ రాశారు. ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ బృందంతో జరిగిన ఒప్పందం, సమావేశాన్ని ప్రస్తావిస్తూ చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. మంచి వాతావరణంలో సంప్రదింపులు జరిపామన్న బిల్ గేట్స్.. పేదలు-అట్టడుగు వర్గాల విద్య, ఆరోగ్యంలో, .. వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధిపై గేట్స్ ఫౌండేషన్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడాన్ని అభినందించారు.

కొన్ని నెలల క్రితం ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ తో ఏపీ బృందం సమావేశమైంది. ఆరోగ్య రంగాన్ని పటిష్ట పరచడంతో పాటు హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్, మెడ్‌టెక్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడం, వ్యవసాయంలో నాణ్యమైన విత్తనాల తయారీ, సాయిల్ హెల్త్ మానిటరింగ్, తల్లీబిడ్డల ఆరోగ్యానికి మైక్రో న్యూట్రీయంట్లు అందించే అంశాలపై చర్చించారు.పాలనలో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు మెరుగైన సేవలు అందించేందుకు చంద్రబాబు చూపిన ఆసక్తి, చిత్తశుద్ధి ఆయన విజన్‌కు నిదర్శనం అని బిల్ గేట్స్ కితాబిచ్చారు. ఏఐ డ్రివెన్ డిసిషన్ మేకింగ్, రియల్ టైమ్ డేటా సిస్టమ్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్ మెంట్.. చంద్రబాబు నాయకత్వ ప్రతిభను మరోసారి బయటపెట్టాయని బిల్ గేట్స్ అన్నారు.గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సేవల్లో ఉత్తమ



ఫలితాలు రాబట్టేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్ తో పాటు భారత్ సహా ఇతర అల్పా ఆదాయ దేశాలకు ఉపయోగపడుతుందన్నారు గేట్స్. ఈసారి తన భారత పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే నాటికి.. మీ నాయకత్వం- మన భాగస్వామ్యంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో అద్భుతమైన పురోగతి సాధిస్తారని ఆకాంక్షించారు. గేట్స్ ఫౌండేషన్-ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యం మున్ముందు కొనసాగాలని కలిసి కట్టుగా పని చేద్దామని ఆశిస్తున్నట్లుగా చెప్పారు బిల్ గేట్స్.

# కాల్పుల విరమణలో అమెరికా పాత్ర శూన్యం



న్యూఢిల్లీ,భారతదేశం-పాకిస్థాన్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పార్లమెంటరీ కమిటీకి చెప్పారని ఓ కథనం తెలిపింది. సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక స్థాయిలో తీసుకున్నారని మిస్రీ నొక్కిచెప్పారని పార్లమెంటరీ వర్గాలు తెలిపినట్లు- పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్-పాక్ వివాదాన్ని ఆపడంలో తన పాత్ర గురించి పదే పదే ప్రస్తావించారు. ట్రంప్ వాదనలపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మిస్రీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కనీసం ఏడుసార్లు కాల్పుల విరమణకు దోహదపడ్డానని బహిరంగంగా చెప్పుకున్నారు. ఈ అంశంపై భారతదేశం ఎందుకు మౌనంగా ఉందని పార్లమెంట్ ప్యానెల్‌లోని ఒక సభ్యుడు ప్రశ్నించారు. ముఖ్యంగా ట్రంప్ తన ప్రకటనలలో కశ్మీర్‌ను ప్రస్తావిస్తూనే ఉన్నారని మరో సభ్యుడు సూటిగా ప్రశ్నించారు. దీంతో భారతదేశం-పాకిస్థాన్ కాల్పుల విరమణ ద్వైపాక్షిక నిర్ణయం అని, మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొంటూ విదేశాంగ కార్యదర్శి ఈ వాదనలను తోసిపుచ్చారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. యుద్ధ విరమణ ఒప్పందంలో అమెరికా ఎటు-వంటి పాత్ర పోషించలేదని మిస్రీ ప్యానెల్‌కు వివరణ ఇచ్చారు. ఇంకా.. భారత్- పాకిస్థాన్ మధ్య వివాదం సంప్రదాయ యుద్ధ పరిధిలోనే ఉందని, ఇస్లామాబాద్ నుంచి ఎటు-వంటి అణ్వాయుధ దాడులకు సంబంధించిన అనుమానిత సంకేతాలు లేవని విదేశాంగ కార్యదర్శి పునరుద్ఘాటించారు. కానీ.. పాకిస్థాన్ చైనా మూలాల సైనిక హార్డ్‌వేర్‌ను ఉపయోగించడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన విక్రమ్ మిస్రీ.. 'వారు ఏమి ఉపయోగించినా పర్వాలేదు. మనము వారి వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాం అని చెప్పినట్లు- తెలుస్తోంది. యుద్ధ సమయంలో కోల్పోయిన భారతీయ విమానాల సంఖ్య గురించిను చెప్పేందుకు మిస్రీ నిరాకరించారు. జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ వ్యాఖ్యానించలేదు.

# ఇకపై ఇద్దరిదే ఒకటే మాట ..ఒకటే బాట!



హైదరాబాద్,బీఆర్ఎస్ లో తలెత్తిన సంక్షోభం సర్దు మణిగిందా? అంటే గులాబీ పార్టీ నేతలు అవుననే అంటున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మధ్య తలెత్తిన వారసత్వ లేదా నాయకత్వ వివాదం ప్రస్తుతానికి సర్దుమణిగినట్లే అంటున్నారు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముందుతరం నేతలు. అవును రెండు రోజుల క్రితం కేటీఆర్ స్వయంగా హరీష్ రావు ఇంటికి వెళ్లి రెండు గంటలకు పైగా చర్చలు జరపడం, ఆ వెంటనే శనివారం హరీష్ రావు నివాసంలో ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డిమాండ్ల గురించి, ఉద్యోగ సంఘాల మాజీ నాయకులతో కేటీఆర్, హరీష్ రావు చర్చించి.. డిమాండ్ల సాధనకు సంయుక్త కార్యాచరణ ప్రకటించడం వారిరువురి మధ్యా వివాదం సర్దుమణిగింది అనేందుకు ఒక సంకేతంగా బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల కాలంలో ముఖ్యంగా గులాబీ పార్టీ రజతోత్సవ వేడుకలకు ముందు తర్వాత ఇద్దరి మధ్య దూరం పెరిగిందన్న ప్రచారం జరుగతున్న నేపథ్యంలో ఇద్దరు కలిసి కూర్చుని.. ఉద్యోగుల సమస్యలపై చర్చించి ఉమ్మడి ప్రకటన చేయడం పార్టీ క్యాడర్ కు మంచి సంకేతం పంపుతుందని అంటున్నారు. నిజానికి ఇటీవల కాలంలో గులాబీ పార్టీలో, ముఖ్యంగా పార్టీ అధినేత కల్వకుట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) కుటుంబంలో అంతర్గత కుమ్ములాటల గురించి పార్టీలో, ప్రజల్లో, మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కేటీఆర్ , హరీష్ రావుల మధ్య విబేధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో వంక కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత పేరు కూడా ఈ చర్చల్లో ప్రముఖంగానే వినిపిస్తోంది. ఈ నేపద్యంలోనే బీఆర్ఎస్ లో మూడు ముక్కలాట సాగుతోందని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా, పార్టీ రజతోత్సవ వేడుకల తర్వాత హరీష్, కేటీఆర్ మధ్య దూరం పెరిగడమే కాకుండా.. హరీశ్ రావు కారు దిగి సొంత పార్టీ పెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలొచ్చాయి. అయితే, హరీష్ రావు ఈ వార్తలను ఒకటికి పదిసార్లు ఖండించారు. అంతే కాకుండా ఇంకో అడుగు ముందుకేసి, కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించినా, తనకు అభ్యంతరం లేదని మీడియా ముఖంగానే స్పష్టం చేశారు. అలాగే.. గత పాతికేళ్ల ప్రస్థానంలో ఏనాడు కేసీఆర్ గీసిన గీత దాటలేదని, ఇక ముందు కూడా కేసీఆర్ మాటే తనకు వేదవాక్కని హరీష్ స్పష్టం చేశారు. నిజానికి, హరీష్ రావు మొదటి నుంచి కూడా కేసీఆర్ తో ఏ విషయంలోనూ విభేదించలేదు. ఇష్టం ఉన్నా లేకున్నా కేసీఆర్ మాట జవదాటలేదు. ఈ విషయంలో మరో అభిప్రాయం లేదని అంటారు. ముఖ్యంగా ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన చెవులు వాడి అన్నట్లుగా, పార్టీలో, ప్రభుత్వంలో కేటీఆర్ ప్రాధాన్యత రోజుర్జుకు పెరుగుతూ వచ్చిన సమయంలోనూ హరీష్ రావు పెదవి విప్పలేదు. ప్రశ్నించలేదు. కేసీఆర్ మాట జవ దాటలేదు. కాబట్టి.. ఇప్పుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించినా హరీష్ రావు ఎదురు తిరిగక పోవచ్చని అంటారు. అయినా అనుమానాలు అయితే అలాగే ఉన్నాయి. అందుకు బలం చేకూర్చేలా ప్రత్యర్థుల ప్రచారం ఉంది. ముఖ్యంగా కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు దూరంగా జరుగుతున్న నేపద్యంలో.. భవిష్యత్ బంధాలు ఎలా ఉంటాయి అనే విషయంలో సహజంగానే హరీష్ రావు వర్గంలో అనుమానాలు ఉన్నట్లు చెపుతున్నారు. నిజానికి పార్టీ కేసీఆర్ కనుసన్నల్లో ఉన్నంత వరకు కుటుంబంలో చిన్నా పెద్ద పొరపొచ్చాలు ఎన్ని వచ్చినా, కేసీఆర్ పెద్దరికంతో ఏదో విధంగా సర్దుబాటు చేస్తూ వచ్చారు. కానీ, పగ్గాలు పూర్తిగా కేటీఆర్ చేతికి వెళ్ళిన తర్వాత తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన హరీష్ అనుచరుల్లో వ్యక్త మావుతోందని అంటున్నారు.అందుకే, కేసీఆర్ చొరవ తీసుకుని, నష్ట నివారణకు నడుం బిగించినట్లు చెపుతున్నారు. ముఖ్యంగా పార్టీ నాయకులు, క్యాడర్ కు తప్పుడు సంకేతాలు వెళితే, భవిష్యత్ లో తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి వస్తుందని కేసీఆర్ ఇటు హరీష్ రావు ను, అటు కేటీఆర్ ను కన్విన్స్ చేసినట్లు చెపుతున్నారు. అందులో భాగంగానే హరీష్ రావు మామ మాట జవదాటను, కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించినా అభ్యంతరం చెప్పను అని మీడియా ముఖంగా, ప్రకటించారని చెపుతున్నారు. అలాగే, కేటీఆర్ ను హరీష్ వద్దకు కేసీఆరే పంపారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇద్దరి మధ్య సుదీర్ఘంగా రెండు గంటల పాటు జరిగిన భేటీలో చాలా విషయాలు ఖుల్లం ఖుల్లా చర్చకు వచ్చినట్లు చెపుతున్నారు.

# ఎయిర్‌పోర్టుల్లా రైల్వే స్టేషన్లు...

కరీంనగర్ రూరల్/బేగంపేట/న్యూఢిల్లీ, రాష్ట్రంలో విమానాశ్రయాలను తలపించేలా ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అధునాతన సౌకర్యాలు, కళ్లు చెదిరే ఎలివేషన్లతో చేపట్టిన నిర్మాణాలు ఆవిష్కరణకు అడుగు దూరంలో ఉన్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లను ఆధునీకరించింది. ఆయా స్టేషన్లలో అత్యాధునిక వసతులను కల్పించింది. 12 మీటర్ల విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు, సరికొత్త టికెట్ కౌంటర్లు, స్నానాల గదులతో వాష్ రూమ్‌లు, టీవీలు, వైఫై, ఆకట్టుకునేలా రూపొందించిన స్టేషన్ ముఖ ద్వారాలు, కనువిందు చేసే వెయిటింగ్ హాళ్లతో ఈ స్టేషన్లను అభివృద్ధి చేసింది. ప్రధాని మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించబోయే 103 రైల్వే స్టేషన్లలో ఈ మూడు స్టేషన్లు కూడా ఉన్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో వరంగల్ స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. కాకతీయుల కళా వైభవం ఉట్టిపడేలా రూ.25.41 కోట్లతో ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దారు. ఎత్తైన శిలా స్థంభాలపై ఉన్న గజ రాజులు ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నట్లుగా స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి.ప్లాట్ ఫాం గోడపై కాకతీయుల చిత్రాలను అందంగా వేశారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం ఉండేలా ల్యాండ్ స్కేపింగ్ చేశారు. స్టేషన్ ముందు కుడివైపు ఎలక్ట్రిక్ వాహనాల కోసం బ్యాటరీ స్వాపింగ్ పాయింట్ నిర్మించారు. గతఏడాది ఆగస్టు 6న కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ప్రధాన మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కరీంనగర్ నుంచి దక్షిణ మధ్య రైల్వేకు గూడ్స్ రవాణాతో రూ.కోట్ల ఆదాయం వస్తోంది. ప్రయాణికుల రద్దీ పెరగడంతో కరీంనగర్‌లో రెండు, మూడు ప్లాట్ ఫాంలను కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనం పక్కనే మరో భవనాన్ని కట్టారు. రైల్వే స్టేషన్‌కు ఏర్పాటు చేసిన ఎలివేషన్, ఎల్ఈడీ లైట్లు ఆకట్టుకుంటున్నాయి. స్టేషన్ ముందు అతి పెద్ద జాతీయ జెండా, కనువిందు చేసేలా ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రూ.25.85కోట్లతో చేపడుతున్న పనులు దాదాపు పూర్తయ్యాయి. గతఏడాది ఫిబ్రవరిలో ప్రధాని




మోదీ బేగంపేట స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జంటనగరాల్లో ముఖ్యమైన స్టేషన్లలో ఒకటైన ఈ స్టేషన్‌ను రూ.26.55 కోట్లతో ఆధునీకరించారు. వినూత్నంగా రూపొందించిన స్టేషన్ ఆర్కిటెక్చర్, పాల పిట్టలు స్వాగతం పలుకుతున్నట్టుగా ఉన్న ముఖద్వారం, స్టేషన్ ముందున్న ల్యాండ్ స్కేపింగ్ ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. సోమవారం ఈ స్టేషన్‌ను సందర్శించిన దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్.. అభివృద్ధి పనులను మీడియాకు వివరించారు.

అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి పోస్టులు

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ముంగింపు దశకు చేరుకున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆధునీకరించిన వరంగల్ రైల్వే స్టేషన్ చిత్రాలను ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. గతేడాది ఫిబ్రవరిలో వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, ఈ ఏడాది మే నాటికి పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద వరంగల్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన పనులు ముగింపు దశలో ఉన్నాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com